వార్త
ఆదివారం
1 జూన్, 2025

# స్కూల్ బ్యాగ్‌లో బాల్యం బందీ!



# బాలకృష్ణ సినిమాలో విజయశాంతి ?



బోయపాటి దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన సినిమాలో 'అఖండ' ఒకటి. 2021లో విడుదలై గొప్ప విజయాన్ని సాధించింది. 'అఖండ' సీక్వెల్‌గా 'అఖండ 2' రాబోతోంది. దాదాపు ముప్పై యేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరూ కలిసి నటించబోతున్నారని, అది కూడా బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2'లో అని గట్టిగా వినిపిస్తోంది. ఈ వార్త నిజమైతే అభిమానులకు పండగే అని చెప్పాలి. గతంలో బాలకృష్ణ, విజయశాంతి జోడీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. 'కథానాయకుడు' సినిమాతో మొదలైన వీరి ప్రయాణం, 'ముద్దుల క్రిష్ణయ్య', 'ముద్దుల మావయ్య' వంటి గోల్డెన్ జూబ్లీ చిత్రాలతో పాటు 'లారీ డ్రైవర్', 'రౌడీ ఇన్స్‌పెక్టర్' వంటి అనేక సూపర్ హిట్ చిత్రాల వరకు సాగింది. వీరిద్దరూ కలిసి ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ' సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ2' తెరకెక్కుతోంది. ఈ పాన్ ఇండియా ప్రాజెక్టులో విజయశాంతి ఓ కీలక పాత్ర పోషించనున్నారని వార్తలు వస్తున్నాయి. అయితే, దీనిపై ఇంతవరకు చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ వార్తలు నిజమై, వీరిద్దరూ మళ్లీ కలిసి నటిస్తే, సినిమాపై అంచనాలు మరింత పెరగడం ఖాయం.

తారాతీరం



# అబ్దుల్ కలామ్ బయోపిక్‌లో ధనుష్

గత కొన్నేళ్లుగా ఎన్నో బయోపిక్‌లు ప్రేక్షకులను పలకరించాయి. వాటిలో పలు చిత్రాలు ప్రేక్షకుల మెప్పు పొందాయి. ఇప్పుడు భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బయోపిక్‌కి ముహూర్తం కుదిరింది.

విభిన్న చిత్రాలతో వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన కోలీవుడ్ హీరో ధనుష్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆధారంగా రూపొందుతోన్న బయోపిక్‌లో నటిస్తున్నాడు. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించారు. ఈ చిత్రానికి 'కలాం' అనే టైటిల్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. 'ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అనేది ట్యాగ్ లైన్. ఈ బయోపిక్‌ని 'తానాజీ' 'ఆదిపురుష్' చిత్రాల దర్శకుడు ఓంరౌత్ రూపొందిస్తున్నాడు.

ఈ ప్రాజెక్ట్‌ను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ బ్యానర్‌లపై అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, కృషన్ కుమార్, గుల్షన్ కుమార్, తేజ్ నారాయణ్ అగర్వాల్ మొదలైనవారు నిర్మిస్తున్నారు. అబ్దుల్ కలాం జీవితం, భారత అంతరిక్ష, రక్షణ కార్యక్రమాలకు ఆయన చేసిన అమూల్యమైన సేవలను ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

ఆదివారం వార్త

1 జూన్, 2025

## మంచి ముత్యాలు

- మౌనం ధ్యానం కంటే గొప్ప ఫలితాన్నిస్తుంది.. ఫలిస్తుంది. ధ్యానంలో నువ్వెవరో తెలుస్తుంది. ఏం చేయాలో సూచిస్తుంది.
- కథగానీ, కవితగానీ కొత్తగా ఉండాలి. చదివినప్పుడు కళ్లు చెమర్చాలి. గొంతులోఅమృత బిందువుల చప్పుడు చెవులకు చేరాలి.

## కదంబం


'సంఘీ'భావం....5

పతనం అంచున మావోయిస్టులు

కవర్ స్టోరీ..6

స్కూలు బ్యాగ్‌లో బాల్యం బందీ!

ఈ వారం కవిత్వం...12

నీ కోసమే నేను

బహుళ ప్రయోజనాలు.. 18

కథ..20

ఆలస్యం అమృతం విషం

సాహిత్యం.. 23

తొలి నాళ్లలో తెలుగు నవల

నైతిక విలువలు పెంచే.. 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వంటలు

వగైరా.. వగైరా..


# సమాచారం

## ఫుట్‌బాల్ జట్టులో వందల మంది?

ఫుట్‌బాల్ జట్టులో పదకొండు మంది ఆటగాళ్లు ఉంటారు. ఇది జగమెరిగిన సత్యం. కానీ ఇంగ్లాండ్‌లోని ఓ పట్టణంలో ఆడే ఫుట్‌బాల్ చిత్రమైనది. ఇందులో ఉండేవి రెండు జట్లు, ఒక్కో జట్టులో వందల మంది ఆటగాళ్లుంటారు. బంతిని కాళ్లతో తన్నుకుంటూ చేత్తో పట్టుకొని పరిగెత్తొచ్చు. గోల్ కొట్టాలంటే వీధులు, అక్కడి నది దాటుకుంటూ ఐదు కి.మీ. దూరం బంతిని తీసుకెళ్లాలి. అందువల్ల ఈ ఆట రెండు రోజులు సాగుతుంది. అసలు సంగతేమిటంటే– ఇంగ్లాండ్‌లోని డర్బీషైర్‌లో ఉన్న యాష్‌బోర్న్ పట్టణంలో యేటా ఫిబ్రవరి/మార్చి నెలలో ఈ ఆటను నిర్వహిస్తారు. దీనిని రాయల్ ష్రోవటైడ్ ఫుట్‌బాల్ అంటారు. స్థానిక యువత అంతా రెండు జట్లుగా విడిపోతారు. ఇక్కో జట్టులో ఆటగాళ్ల సంఖ్య వందల్లో ఉంటుంది. గోల్స్ ఊరికి ఉత్తర, దక్షిణ దిక్కుల్లో ఐదు కి.మీ. దూరంలో ఉంటాయి. పట్టణం మధ్యలో ఉన్న కార్ పార్కింగ్ ప్రాంతంలో క్రీడను ప్రారంభిస్తారు. ఇసుక వేస్తే రాలనంత జనం మధ్యలో బంతిని విసురుతారు. అది ఆ ప్రాంతం నుంచి బయటకు రావడానికి 45 నిమిషాలు పడుతుంది. ఆ తర్వాత అసలు ఆట మొదలవుతుంది. బంతిని పట్టుకొని వీధులు, రోడ్లు, నది, వంతెనలు.. ఇలా దేన్నీ లెక్క చేయకుండా పరిగెడుతూనే ఉంటారు. మొదటి రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఈ ఆట ఎనిమిది గంటల పాటు సాగుతుంది. ఆ తర్వాత విశ్రాంతి ఇచ్చి, మరుసటి రోజు మళ్లీ కొనసాగిస్తారు. దీనికి రెండు నిబంధనలున్నాయి. ఒకటి: బంతిని ప్రార్థనా మందిరాలు, శ్మశానం కాకుండా ఎటునుంచైనా తీసుకెళ్లొచ్చు. రెండు: బంతికోసం కొట్లాడుకోవచ్చు కానీ ఒకరినొకరు చంపుకోకూడదు. ఆటగాళ్లు విజయం కంటే ఆటతీరును బాగా ఎంజాయ్ చేస్తారు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com









ఆకలి రుచి ఎరుగదు.. నిద్ర సుఖమెరుగదు అంటారు. కానీ ఈ చిత్రాలు చూస్తుంటే నిద్రలేమితో బాధపడేవారికి సైతం ఈ బెడ్ మీద పడుకుంటే క్షణాల్లో గాఢ నిద్రలోకి వెళ్లిపోవచ్చు అనిపిస్తోంది కదూ.. మరెందుకు ఆలస్యం.. మార్కెట్‌లో లభిస్తున్న దీపాల బెడ్‌రూమ్స్‌ని మీ ఇంట్లోనూ చేర్చుకోండి.

















# పతనం అంచున మావోయిస్ట్‌లు

కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కగార్ ఆపరేషన్‌లో మావోయిస్ట్ పార్టీ అగ్రనేత నంబాళ్ల కేశవరావు అలియాస్ బస్వరాజు మృతిచెందడం ఆ పార్టీకి పెద్ద కుదుపుగానే చెప్పవచ్చు. పీపుల్స్ వార్ గ్రూప్ నుంచి ప్రస్తుతం ఉన్న మావోయిస్ట్ పార్టీ వరకు పరిశీలిస్తే కేవలం ముగ్గురు మాత్రం కేంద్రం ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్నారు. పీపుల్స్ వార్ గ్రూప్‌గా ఉన్నప్పుడు కొండపల్లి సీతారామయ్య అన్నీ తానై పార్టీని నడిపారు. 2004లో దేశంలోని అన్ని తీవ్రవాద సంస్థలు ఒక తాటిపైకి వచ్చి సిపిఐ మావోయిస్ట్ పార్టీగా రూపాంతరం చెందింది. దీనితో ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి పార్టీ సారథ్యాన్ని చేపట్టారు. అయితే 2018లో అనారోగ్య కారణాలతో పార్టీ నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఈ సమయంలో సెంట్రల్ మిలటరీ కమిషన్ అధిపతిగా ఉన్న నంబాళ్ల కేశవరావుకు పార్టీ పగ్గాలు అందిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి కేశవరావు పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వస్తున్నారు. 1955లో శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన కేశవరావు హైస్కూలు విద్య నుంచే తీవ్రవాద భావాజాలాన్ని ప్రదర్శించి అనేక ఉద్యమాల్లో పాల్గొంటూ వచ్చారు. విద్యలో అనూహ్య ప్రతిభను కనబరుస్తూ వరంగల్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తి చేశారు. కొండపల్లి సీతారామయ్యతో సన్నిహితంగా మెలుగుతూ ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం ఎంటెక్ చదివే సమయంలో పూర్తి సమయాన్ని గిరిజనుల అభ్యున్నతికి కేటాయించాలన్న ఉద్దేశంతో అజ్ఞాతంలోకి వెళ్లి పార్టీలో పూర్తి స్థాయి నేతగా కొనసాగారు. కిందిస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీలో అత్యున్నత స్థానమైన పార్టీ కార్యదర్శి హోదాను స్వీకరించారు. ఇటీవల కగార్ ఆపరేషన్‌లో భాగంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఈయన స్థానంలో ఎవరు ఉంటారన్న దానికంటే పార్టీని ఎలా నడపాలి.. అన్న సమస్య కీలకంగా మారింది. పార్టీ కేంద్ర కమిటీలో కార్యదర్శిగా ఉన్న నంబాళ్లకు సన్నిహితంగా ఉన్న సీనియర్ కేడర్ ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. దీనితో పార్టీ స్పష్టమైన శూన్యత ఏర్పడింది. కొద్దిమంది పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు మాత్రమే చురుకుగా ఉన్నట్టు తాజాగా ఐ.బి వర్గాల అంచనా. రామన్న, హరిభూషణ్, రామకృష్ణ, కటకం సుదర్శన్ వంటి ప్రధాన నాయకులు అనారోగ్యం, ఎన్‌కౌంటర్లకు బలయ్యారు. సీనియర్ నాయకుడు చలపతి ఇటీవల గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. జార్ఖండ్‌కు చెందిన అగ్రశ్రేణి నాయకుడు ప్రశాంత్ బోస్‌ను అరెస్టు చేశారు. ఈ ఎదురు దెబ్బలతో నక్సలైట్ నెట్‌వర్క్ దాదాపుగా పూర్తిగా అంతరించిపోయింది. కీలకమైన నక్సలైట్ నాయకుల కదలికలను ట్రాక్ చేయడానికి భద్రతా దళాలు డ్రోన్‌లు, ఉపగ్రహ ఇమేజింగ్, ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపయోగిస్తున్నది. మావోయిస్టు నాయకుల చుట్టూ ఉచ్చు బిగించడానికి సిఆర్‌పిఎఫ్ బెటాలియన్లు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ యూనిట్లను బలోపేతం చేశారు. మావోయిస్టులకు ఆర్థిక, లాజిస్టికల్ మద్దతు వ్యవస్థ దాదాపు స్తంభించిపోయింది. నిధుల కొరత, కీలక నాయకుల ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు ఉద్యమ ప్రభావాన్ని బలహీనపరిచాయి. పట్టణాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, మేధావులు, పౌరహక్కుల కార్యకర్తలు, కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, ఇతర ప్రజాసంఘాల కదలికలపై నిఘా తీవ్రతరం చేశారు. దీనితో మైదాన ప్రాంతాల నుంచి అండ లేకుండా పోయింది. గతంలో కూంబింగ్ ఆపరేషన్లను మావోయిస్ట్‌లు సునాయాసంగా ఎదుర్కొనేవారు. గెరిల్లా పోరాటంలో ప్రత్యేక తర్ఫీదు పొందిన హిడ్మా వంటి నేతలు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టేవారు. అప్పట్లో నక్సలైట్ల కదలికలకు సంబంధించిన సమాచారం అందిన తరువాత ఆ స్థలానికి చేరుకోవడానికి పోలీసులకు కనీసం 48 గంటల సమయం పట్టేది. తమ కదలికలు పోలీసులకు సమాచారం అందిన విషయాన్ని కొరియర్ల ద్వారా తెలుసుకుని అక్కడి నుంచి మకాం మార్చేవారు. ఒకవేళ పోలీసులు తారసపడినా తమ వద్ద ఉన్న అత్యాధునిక ఆయుధాలతో సమర్థవంతంగా ఎదుర్కొనేవారు. అటవీ ప్రాంతంలో పరిస్థితులు, పరిసరాలు పోలీసుల కంటే మావోయిస్ట్‌లకే ఎక్కువగా తెలిసేది. దీనితో వారు సునాయాసంగా తప్పించుకునేవారు. అదేవిధంగా కొన్ని సందర్భాల్లో పోలీసులను వలపన్ని తమ మార్గానికి తెచ్చుకుని మందుపాతరలు పేల్చి హతమార్చిన ఘటనలు ఉన్నాయి. అదేవిధంగా కొందరు పోలీసు అధికారులను హిట్ లిస్ట్‌లో చేర్చి మైదాన ప్రాంతాలకు వచ్చి వారిని హతమార్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీనితో నక్సలైట్ల అణచివేత ఆపరేషన్లలో పాల్గొనే అధికారులు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చేది. అయితే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్ ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. ఎక్కడో ఉన్న సిఆర్‌పిఎఫ్ దళాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొంటు న్నాయి. పైగా వీరి దగ్గర అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే మార్చి నాటికి కేంద్రం మావోయిస్ట్ రహిత దేశం లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు



# స్కూల్ బ్యాగ్‌లో బాల్యం బందీ!

తెలుగు రాష్ట్రాలలో జూన్ రెండవ వారంలో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. జూన్ నెల మొదటి వారం ముగిసేసరికి విద్యార్థుల చేతుల్లో పుస్తకాల బరువే కాదు.. తల్లిదండ్రుల మనసుల్లో భారం కూడా ప్రారంభమవుతుంది. “బడి గంట మోగింది” అన్న శబ్దంతో విద్యార్థుల బాల్యాన్ని మళ్ళీ చదువుల బరువు తాకనుంది. కానీ ఈ మోగుతున్న ‘బడి గంట’ అనేది కేవలం పాఠశాల ప్రారంభాన్ని మాత్రమే సూచించడం లేదు. ఈ గంట శబ్దం విద్యా వ్యవస్థలోని నిద్ర లేని ప్రశ్నలకు, అపసవ్య విధానాలకు, తల్లిదండ్రుల అత్మవేదనలకు ప్రతిధ్వనిగా మారుతూ ఉంది. అంతేకాదు, ఈ గంట శబ్దం విద్యా వ్యవస్థలో కొనసాగుతున్న అనేక సమస్యలకు గట్టిగా మోగుతున్న హెచ్చరిక లాంటి గడియారమై నిలిచింది. పాఠశాలల పునఃప్రారంభంతో అప్పుడే సెలవులు పూర్తి అయిపోయాయా? అనే దిగులు పిల్లల్లో కనిపిస్తూ ఉంది. బలవంతంగా స్కూలు వద్ద దింపే తల్లి తండ్రులు ఒక వైపు; కళ్ల నీళ్లతో భారంగా స్కూల్లోకి అడుగు వేసే పిల్లలు వేరొక వైపు; ఆనందంగా స్కూలు ప్రాంగణంలోకి ప్రవేశించి తల్లి తండ్రులకు సంతోషంగా టాటాలు చెప్పి పిల్లలు ఇంకొక వైపు మనకు కనిపిస్తూ ఉంటారు. పాఠశాల పునఃప్రారంభం అనేది కొందరు చిన్నారులకు తొలి అడుగుగా ఉంటే– మరికొందరికి నూతన తరగతికి ప్రవేశంగా కొత్త ఆశలు బలోపేతానికి ఇది ప్రేరణ ఇస్తుంది. ఇలా విభిన్న దశలలో విభిన్న వయో వర్గాల పిల్లలు ఆయా స్కూళ్ల ప్రాంగణాలలో బాధతో, ఉత్సాహంతో కేరింతలతో వేసవి సెలవుల అనంతరం తిరిగి మళ్లీ తరగతుల గడియారం మోగింది. అయితే ప్రతీ సంవత్సరం సాంప్రదాయంగా వస్తున్న స్కూళ్ల పునఃప్రారంభ సమయంలో పిల్లల సందడితో పాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యల తోరణాలు యథావిధిగా పునరావృతమవుతూ తిరిగి స్వాగతః పలుకుతూనే ఉన్నాయి.

## విద్యా ప్రవేశం

పాఠశాలలో ప్రవేశం అంటే కేవలం పాఠాలు నేర్చుకోవడం? పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడమేనా? అనే ప్రశ్నలకు ఆనేకమంది విద్యావేత్తలు, మహానుభావులు ఎన్నో రచనలు ద్వారా విపులంగా వివరించారు. విద్య అనేది ఆత్మాన్వేషణకు, మానవ విలువల ఆవిష్కరణకు మార్గంగా తమ రచనలు ద్వారా చూపించారు. “మనిషిని మనిషిగా తీర్చిదిద్దే శక్తి విద్యగా” గురజాడ వర్ణించగా– “శిక్షణ లేని మేధస్సు కు ఒక అస్త్రం” అని అంబేద్కర్ హెచ్చరించగా; టాగోర్ “విద్య అనేది మనిషిలోని ఉత్సాహాన్ని లేపే ఒక జీవన విధానం” అంటూ నిర్వచించారు. విద్య అనేది బుద్ధి పెంపు కోసమే కాదు. జీవనోపాధి సాధన మాత్రమే మనిషిని మానవత్వంతో తీర్చిదిద్దే సాధనమే విద్య. విద్యను ఒకప్పుడు జీవన మార్గంగా భావించేవారు. ఇప్పుడు మాత్రం జీవించేందుకు విద్య కావాలి అనే భావనతో కాకుండా జీవితం ఎవరితో పోటీ పడాలో నేర్పించేందుకు విద్యాభ్యాసం మారిపోయింది. మన సమాజంలో చదువు అన్నది విద్యార్థిని మంచి మనిషిగా తీర్చిదిద్దే ఒక సాధనంగా మారాల్సింది. కానీ క్రమేపీ అది ఒక హంగు, ఒక బ్రాండ్ ఒక మోజుగా మారిపోతోంది. తల్లి తండ్రులు ఆశయాల కన్నా, ప్రతిష్టా పరిరక్షణ, ప్రధాన లక్ష్యంగా మారిపోయింది.

## రాజ్యాంగం చెబుతున్న విద్యా ఆశయాలు

భారత రాజ్యాంగ ఆర్టికల్ 45 ప్రకారం 6 నుండి 14 ఏళ్ల వయసుగల పిల్లలందరికీ ఉచిత ప్రాథమిక విద్యను అందించడం ప్రభుత్వ ధర్మంగా పేర్కొంది. తరువాత 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21ఏ ఆర్టికల్ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చారు. కానీ ఈ ఆశయాలను సాధించాలంటే కేవలం నిబంధనలకే కాకుండా నిజమైన నిబద్ధతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే ఈ నియమాల అమలు తీరును పరిశీలిస్తే ఆశించిన ఫలితాల కంటే ఆచరణ లోపాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## విద్య హక్కు చట్టం కాగితాలకే పరిమితం

విద్య హక్కు చట్టం (ఆర్‌టిఇ) ప్రకారం విద్య అందరికీ ఉచితం, సమానంగా ఉండాలి. ప్రభుత్వ పర్యవేక్షణ లోపించడంతో, ప్రైవేట్ పాఠశాలలు ఉచ్చుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఉపాధ్యాయుల సేవలు, విద్యార్థుల హక్కులు, భద్రత, మౌలిక వసతులు మొదలైన వాటికి కచ్చితమైన పర్యవేక్షణ లేకుండా పోతోంది. 2010లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇవ్వాలి. (ఆర్‌టిఇ12(1)(సి)). కానీ ఏ పాఠశాల కూడా ఈ నిబంధన పాటించడం లేదనే చెప్పాలి. ప్రైవేట్ పాఠశాలలు నియమాలను ధిక్కరిస్తున్నా పట్టించుకునే అధికారులే కనిపించడం లేదు.

## బాల్యం బందీ

ఒకప్పుడు రాజ్యాంగంలో పేర్కొన్న నియమాలు ప్రకారం విద్య ప్రారంభానికి ఓ నిర్ణీత వయసు ఉండేది. ఆ వయసు వచ్చే వరకు పిల్లలు మట్టిలో ఆడి, చెట్లెక్కి, నదుల పక్కన తిరుగుతూ జీవితాన్ని ఆస్వాదించేవారు. అది బాల్యం అనే పదానికి అర్థత ఇచ్చే జీవనశైలి. దీనిలో పాఠశాల అనేది ఆటల మధ్య ఒదిగిపోయే ఓ చిన్న భాగం మాత్రమే ఉండేది. ఈ జీవన శైలిలో పిల్లలు మాటలు స్పష్టంగా పలికివారు అంతే కాదు వారి ప్రశ్నలు కూడా సూటిగా ఉండేవి. స్వేచ్ఛగా జీవించే ప్రకృతి సంబంధిత బాల్యాన్ని హరించేదిగా విద్య ఉండకూడదు. విద్యాభ్యాసం అనేది ఒక ప్రక్రియ. ఇది వయస్సుకు, తగిన అభివృద్ధిని పరిగణలోకి తీసుకొని, ప్రతి చిన్నారి మేధ, భావోద్వేగ, శారీరక స్థాయిని గమనిస్తూ సాగాలి. కానీ సమకాలీన సమాజంలో ఈ ప్రక్రియ ఒక రేసుగా మారింది.

బాల్యం అనేది అంతులేని అడవి. దానిలో కమ్మని కథలు, ఆటల కబుర్లు, ఊసుల నడకలు అలా బాల్యం అనేది ఒక కవితలా మిగిలేది. బాల్యానికి అరంభ బాల్యంలో మొదటి అక్షరం ఆటలే అనే తొలి పాఠాన్ని మర్చిపోయి మాటలు కూడా రాని వయసులో ఎల్‌కేజీ, యుకేజీ, కిండర్ గార్డెన్, ప్లే స్కూల్ అనే పేర్లతో బాల్యాన్ని స్కూల్ బ్యాగ్‌లో బంధిస్తున్నారు. పసిమొగ్గలను బడిలోనికి నెట్టేస్తున్నారు. మాటలు రావడానికి ముందే ఎబిసిడిలు నేర్పుతున్నారు. ఐదు పదాలు కూడా మాట్లాడలేని వయసులో ఒత్తిడితో బాటుగా పిల్లలు బడిలోకి నెట్టబడుతున్నారు. కలలు కనాల్సిన వయసులో అలారంతో లేచే జీవితానికి పునాది వేస్తున్నారు. ఇంకా తల్లి ఒడిలో ఉండాల్సిన వయసులో, షూలు వేసుకుని పుస్తకాల బస్తాలు మోస్తున్నారు. విద్య అనేది మానవ జీవనానికి మార్గదర్శకంగా ఉండాల్సింది. బాల్యంలో ఆటవిడుపు, అనుభవం, అభివృద్ధి అనేవే కేంద్రంగా ఉండాల్సింది. కానీ ఇటీవల కాలంలో శైశవ దశలోనే విద్య అనే భారం భుజాన వేసే దురాచారం వేగంగా పెరుగుతోంది. బిడ్డ పుడుతుందనే విషయం తెలిసిన మరుసటి రోజే స్కూల్ అడ్మిషన్ కోసం తల్లిదండ్రుల ప్రయత్నాలు మొదలవుతున్నాయి.

## విద్యా వ్యవస్థలో మారిన పరిణామాలు

ఒకప్పుడు విద్య అన్నది ప్రభుత్వ పాలనా విధుల్లో ఒక ప్రధాన ముద్రగా ఉండేది. గురుకులాల నుండి స్థానిక పాఠశాలల వరకు, విద్యార్థి జీవితం అంటే అనుభవాల ద్వారా అభ్యాసం, మానవీయ విలువలపై శ్రద్ధ అనే భావనలు సహజంగా నిండివుండేవి. కానీ కాలక్రమంలో పాలకుల దృష్టి విద్య నాణ్యత పెంచడంపై కాకుండా విద్యకు అయ్యే 'వ్యయాన్ని తగ్గించడం' పైనే ఉండిపోయింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల హంగు తగ్గింది. ప్రైవేటు సంస్థలకు జోరు పెరిగింది. విద్య అనేది హక్కు నుంచి ఉత్పత్తిగా మార్పు చెందింది. విద్య=విజ్ఞాన+నైతికత +వ్యక్తిత్వ వికాసం అనే గణితం మర్చిపోయి విద్య=మార్కులు + ర్యాంకులు + జీతాలు అనే లెక్కలో పరిమితమైపోయే పరిస్థితి దాపురించింది. విద్య పట్ల సమాజానికి ఉన్న నిర్వచనమే మారిపోయింది. విజ్ఞానం బదులు ధనార్జన, నైతికత బదులు ప్రదర్శన అనే లక్ష్యాలు ప్రబలమవుతున్నాయి. పసి మనసును నిర్బంధంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. దీనివలన పిల్లల మనోభావ వికాసాన్ని, మానవీయ సంబంధాలను వ్యక్తిత్వ పరిపక్వతను క్రమంగా అభివృద్ధి చేసే విద్య నేడు మార్కుల గణాంకాలుగా మారిపోయింది.



పుస్తకాల బరువువయసుకు మించిన పుస్తకాల బ్యాగ్ బరువులను చిన్నారులు మోసే పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఈ బరువులు పెరిగిపోయాయి. ఇంత పిన్న వయసులో అంత బరువులు మోస్తే పిల్లల వెన్నుపూస వంపు తిరిగి దాని ప్రభావం వారిపై జీవితాంతం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో నో బ్యాగ్ డే అని ఒక రోజును కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు, పిల్లల పుస్తకాల కోసం స్కూల్లోనే ఓ ప్రత్యేక అర కేటాయించాలని ఆదేశాలు ఇచ్చారు. తాజాగా ప్రతిరోజూ అన్ని పుస్తకాలు తీసుకురావాల్సిన అవసరం లేకుండా మొత్తం సంవత్సర సిలబస్ వివిధ భాగాలుగా చేసి సెమిస్టర్ వైజ్‌గా ఒకే పుస్తకంలో ఏవిధ సబ్జెక్ట్ భాగాలను తీసుకు రావాలనే ఆలోచన చేశారు. ఇవన్నీ ఆలోచనలు, సిద్ధాంతాలు తప్ప కార్యాచరణ అనేది లేకుండా పోతోంది. పిల్లలు ప్రయాణించే వాహనాలలోని బ్యాగ్‌ల పరిమాణం చూస్తే ఆశ్చర్యం కలగక మానదు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు అనేవి పిల్లలకు అత్యంత సమీపంగా ఉండాలి. తల్లితండ్రులు సహాయం లేకుండా పిల్లలే స్కూల్‌కు వచ్చే సదుపాయం ఉండాలి. అప్పుడే పిల్లల నమోదు పెరుగుతుంది. డ్రాప్ ఔట్స్ తగ్గుతాయి. ఈ విషయంలో ప్రభుత్వాలు పిల్లల సంఖ్య స్కూల్ నిర్వహణకు అయ్యే వ్యయం వాటిని లెక్కిస్తూ పొదుపు మంత్రం పేరిట స్కూళ్లను రద్దు చేసే వేరే స్కూళ్లకు కలిపి వేస్తున్నారు. ఈ స్థితిలో పేద, మధ్య, తరగతి వర్గాలకు చెందిన పిల్లలను పెరిగిన ట్రాఫిక్ రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అంత దూరం పంపడం లేదు. రోడ్డు రవాణా వాహనాల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాట్లు చేసినా అవి ఏ సమయానికి వస్తాయో తెలియని అనిశ్చితి నెలకొంది. భాగ్యవంతుల పిల్లలను అయితే వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేటు వాహనాల్లో పంపుతున్నారు.

## తల్లితండ్రుల దృక్పథం

తమ పిల్లలు ఇతరుల కంటే ముందుండాలి. చదువులోనూ, పరీక్షలలోను 'టాప్ స్కోర్' సాధించాలి. ఇది వారి సహజమైన ఆకాంక్ష అయినప్పటికీ, వారు తమ పిల్లల వ్యక్తిగత సామర్థ్యాలు, అభిరుచులు, మనోభావాలు, అభివృద్ధి స్థాయిని పరిగణలోనికి తీసుకోవడం లేదు.

పిల్లల వయస్సును మరిచి, మార్కుల మోజుతో, ఇతరులతో పోల్చే దృక్పథంతో ముందుకెళ్తున్నారు. ఇది వారి పిల్లల బుద్ధి వికాసాన్ని నిరోధిస్తుందనే విషయం గుర్తించడం లేదు. పిల్లల సహజ ప్రతిభను గుర్తించి, వారిలో నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా దృష్టి పెట్టడం లేదనే చెప్పాలి. లక్షలు ఖర్చు చేసి స్కూల్‌లో చేర్పించడమే కాదు, ఆ స్కూల్ పిల్లల్లో నిజంగా జీవితానికి అవసరమైన విలువలను నేర్పుతోందా లేదా అని కూడా పరిశీలించాలి. శ్రేష్ఠమైన విద్యకు ఎప్పుడూ శ్రద్ధే మూలం తప్ప ఖరీదైన ఫీజు కాదనే సత్యాన్ని గ్రహించడం లేదు. ఈ విధంగా పిల్లల మనస్సు మీద మితిమీరిన అంచనాలు వేసి, ఇతరులతో పోల్చడం వల్ల వారు నెమ్మదిగా తమలో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తున్నారు తప్ప మానవ సంబంధాలు కుటుంబ సంబంధాలు వంటి అంశాలపై దృష్టి పెట్టడం లేదు. ఈ కారణం చేత పెద్దలతో ఎలా మాట్లాడాలి, భయాలను ఎలా ఎదుర్కోవాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి.. అనే సామాజిక నైపుణ్యాలు కోల్పోతున్నారు. విజయం అనే పదాన్ని మాత్రమే తెలుసుకుంటూ అపజయాన్ని తట్టుకోలేని స్థితికి చేరుతున్నారు. ఈ పరిస్థితికి ఉపాధ్యాయుల కంటే ఎక్కువగా తల్లిదండ్రుల అవగాహన లోపమే ప్రధాన కారణమని చెప్పాలి. విద్యా వ్యవస్థలో ఈ ఒత్తిడి తల్లి తండ్రులు ఆకాంక్షల ఫలితం.




"మన పిల్లలు ఇతరుల కన్నా వెనుకబడకూడదు" అన్న పోటీ భావన పిల్లలపై ఒత్తిడిగా మారుతోంది. ఫలితంగా చదువంటే భయం పెరిగి పాఠశాల వేదనగా మిగులుతోంది. బాల్యంలో ఆనందాన్ని అనుభవించాల్సిన వారి, భవిష్యత్తు గురించే ఆలోచించే మానసిక స్థితిలోకి వెళ్తున్నారు. ఈ పరిస్థితికి ముగింపు అవసరం. తల్లిదండ్రులు పిల్లల ప్రతిభ, అభిరుచులపై నమ్మకాన్ని ఏర్పరచాలి. విజ్ఞానం కంటే విలువలు, గణిత శాస్త్రం కంటే గుణ నైపుణ్యం, మార్కుల కంటే మానవీయత ముఖ్యమని అర్థం చేసుకోవాలి. చదువు పట్ల ప్రేమను, ఆసక్తిని పిల్లల్లో నాటాలి. అప్పుడే బాల్య కాంతిమయంగా మారుతుంది. ప్రభుత్వ విధానాలు 'విద్య కోసం ఖర్చు చెయ్యడంలో మేం వెనుకంజ వేసేది లేదు' అని ప్రభుత్వాలు బల్ల గుద్ది చెబుతూ ఉన్నాయి.

## ప్రభుత్వ పాఠశాలల వైఫల్యం

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యా దీపికలుగా వెలిగేవి. నేటి తల్లిదండ్రులలో ఎంతోమంది అదే ప్రభుత్వ పాఠశాలల విద్యను అబ్బురంగా స్మరించుకుంటారు. వారు చదువుకున్న వాతావరణం, ఉపాధ్యాయుల త్యాగం, మానవీయ విలువలు, మిత్రుల స్నేహం.. ఇవన్నీ జీవితానికి బలమైన మౌలికాలను అందించాయి. కానీ ఆ తల్లిదండ్రులే తమ పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలలకు పంపించకపోవడం శోచనీయం. "మేం ఎదుర్కొన్న కష్టాలు పిల్లలు చూడకూడదు" అనే భావనతో, వారి బాల్యంలోనే అన్ని సౌకర్యాలు సమకూర్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల లోపం, మౌలిక వసతులు లేకపోవడం, పాఠశాల భవనాల పరిస్థితి శోచనీయంగా ఉండడం కారణంగా ప్రజలు వాటి వైపు తిరిగి చూడడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పోషక విలువలు కలిగిన ఆహారం.. ఇలా బహుముఖ ప్రయోజనాలు ఉన్నా, విద్యా ప్రమాణాలు మెరుగవ్వలేక పోతున్నాయి. ఫలితంగా ఈ పాఠశాలల వైపు ప్రజల నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య లభిస్తున్నా, కొందరు తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలు పనులకు పంపిస్తున్నారు. చిన్నారులు పెట్రోల్ బంకుల దగ్గర, టీ హోటళ్ళలో కూలీల పనుల్లో కనిపిస్తున్నారు. ఇది బాల కార్మిక చట్టానికి వ్యతిరేకం అయినప్పటికీ, ప్రభుత్వాలు ఈ పరిస్థితిని పూర్తి స్థాయిలో కట్టడి చేయలేకపోతున్నాయి. అదే సమయంలో ప్రైవేటు విద్యా సంస్థల ప్రకటనలకు తల్లితండ్రులు బలంగా ఆకర్షింపబడుతున్నారు. ఫీజులు భారం అయినా అప్పులు చేసి పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేటు స్కూళ్లల్లో చదివిస్తున్న మధ్య తరగతి తల్లిదండ్రులు వేదన చెప్పనలవి కాదు. ముఖ్యంగా, పాఠశాలల నిర్వహణపై ఉన్న అధికారుల నిరక్ష్యం, సమీక్షలు గానీ, క్రమశిక్షణగానీ లేకపోవడం వల్ల అవి నెమ్మదిగా నాశనానికి గురవుతున్నాయి. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నా వారు బోధన కన్నా ఇతర పనుల్లో నిమగ్నమవుతుండటమే ప్రధాన లోపం.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే ఉపాధ్యాయులు మాస్టర్స్ డిగ్రీలు, బిఈడి వంటి ప్రమాణాలతో అర్హత కలిగినవారే. అయితే, ప్రైవేట్ స్కూళ్లలో ఎలాంటి బోధనా అర్హతలు లేని వ్యక్తులు కూడా క్లాసులు చెప్పడం కనిపిస్తోంది. అయినప్పటికీ, ప్రైవేట్ పాఠశాలలే సక్సెస్ అవుతున్నాయి. ఎందుకంటే శిష్టాచారం, క్రమశిక్షణపై ప్రత్యేక శ్రద్ధ, నిత్య సమీక్షలు, ఫలితాలపై దృష్టి తల్లిదండ్రులకు సమయానుకూల సమాచారం అందించడం మొదలైనవి.




## కార్పొరేట్ విద్యా సంస్థలు

ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు ఆధునిక వాతావరణం, ఇంగ్లీష్ మీడియం, ఐటి ఆధారిత బోధనతో తల్లిదండ్రులకు ఆకర్షణగా మారుతున్నాయి తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థితిని దాటి అప్పులు చేసైనా ప్రైవేట్ స్కూల్ ఫీజులు చెల్లిస్తున్నారు. చెట్ల కింద చదువుకున్న తల్లిదండ్రుల పిల్లలు ఏసీ గదుల్లో చదువుతున్నారు. ఈ సౌకర్యాల మత్తులో పెరిగిన పిల్లలు జీవితంలో చిన్న ఎదురు దెబ్బకు కూడా తట్టుకోలేని స్థితికి చేరుతున్నారు.

ఎందుకంటే వాళ్లు ఆసలే కష్టాన్ని ఎదుర్కొనే అవసరం లేని వాతావరణంలో పెరిగారు. ఆటలలో ఓడిపోవడం నేర్చుకోలేదు, పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినప్పుడు తలవంచడం ఎలా అనే అనుభవం లేదు. అసలు 'ఓటమి' అనే పదమే తెలియదు. విద్య అనేది కేవలం జ్ఞాపక శక్తికి పరిమితమైనది కాదు. అది జీవితాన్ని తట్టుకునే శక్తిని అందించాలి.

నైతికత లేని విద్య బలం పుంజుకోవడానికి కార్పొరేట్ విద్యా సంస్థల తీరును ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దురదృష్టకర విషయం ఏమిటంటే ఒక్క నీతి కథను కూడా చెప్పే అవకాశం లేని బోధనా విధానం కార్పొరేటు విద్యా రంగం ద్వారా పుట్టుకొచ్చింది. పిల్లల బుద్ధి అభివృద్ధికి తప్పకుండా కావలసిన నైతిక బోధనలు, జీవన విలువలు అనేవి కనుమరుగైపోయాయి ఒకప్పుడు చదువు రానివారు కూడా పెద్దల మాట వినటం, సంఘాన్ని గౌరవించడం, పరుల బాధలను అర్థం చేసుకోవడం వంటి విలువలు జీవితంలో నేర్చుకున్నారు. జీవితాన్ని అనుభవంగా నేర్చుకుని సంఘంలో గొప్ప వ్యక్తులుగా ఎదిగారు, మరెందరికో ఉపాధి అందించగలిగారు. ఈ పరిస్థితి కాస్తా కార్పొరేట్ విద్య పుణ్యమా అని ఇప్పుడు తెరమరుగైపోయింది. కేవలం పుస్తకంలో ముద్రితమైన విషయమే చదువు, మార్కులే లక్ష్యం అనే దశకు కార్పొరేట్ విద్య చేరుకుంది. తద్వారా మానవత్వం, సహానుభూతి, సేవాభావం వంటి విలువలు బోధించడం అనేది అదృశ్యం అయిపోయింది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలో విద్యా కేంద్రాలు. అలాంటి బడుల్లో చదివి ఉన్నత స్థాయిలో ఉన్న తల్లితండ్రులు సైతం తమ పిల్లలను మాత్రం ఇప్పుడు కార్పొరేట్ స్కూళ్లలో చేర్పించడమే ఆశయంగా భావిస్తున్నారు. ఎందుకంటే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం మసకబారింది. శుభ్రత, హాజరు, ఉపాధ్యాయుల అందుబాటు, భాషా బోధన వంటి అంశాల్లో క్రమేపీ కార్పొరేట్ పాఠశాలలు ముందంజలో ఉన్నాయని భావిస్తున్నారు. అయితే కార్పొరేట్ బడుల విజయం దాని నైతికతలో లేదు అది మార్కెటింగ్‌లో ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ విద్యా సంస్థలు సొంత వ్యాపార సంస్థలుగా మారాయి యూనిఫామ్స్, పుస్తకాలు, స్టేషనరీ అన్నీ తమ వద్ద నుంచే కొనాలనే ఒత్తిడితో తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. ఒక ప్లే స్కూల్ కూడా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తోంది. ఇదంతా ప్రభుత్వాలకు తెలియని విషయం ఏమీ కాదు. విద్యా హక్కు చట్టం ద్వారా ఈ తరహా దోపిడీని కట్టడి చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వాలు మిన్నకుండి పోతున్నాయి.



## లవ్ అగర్వాల్ కమిటీ

ప్రైవేట్ పాఠశాలల ఆర్థిక స్వేచ్ఛ పేరిట విధ్వంసానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం లవ్ అగర్వాల్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కొన్ని కీలక ప్రతిపాదనలు చేసింది, కాషన్ డిపాజిట్ రూ.5,000 మించరాదని, ఐదవ తరగతి వరకు గరిష్ఠ ఫీజు రూ.24,000, పదవ తరగతి వరకు రూ.30,000గా పరిమితం చేయాలి. పాఠశాలలకు టెక్నో, హైటెక్, మోడర్న్, స్మార్ట్.. వంటి ఫాన్సీ పేర్లు పెట్టరాదు. కానీ ఈ సూచనల అమలులో పురోగతి లేదు. ఇప్పటికీ స్కూళ్లు లక్షల్లో డిపాజిట్లు, పాఠ్యపుస్తకాల పేరుతో వసూళ్లు చేస్తున్నారు. ఈ దోపిడీ ప్రధానంగా మధ్య తరగతి తల్లిదండ్రులను అప్పులపాలు చేస్తోంది. పిల్లల విద్య కోసం త్యాగం చేయడం గొప్ప లక్షణమే, కానీ ఆ త్యాగం నాణ్యత గల విద్యను అందించకపోతే వ్యర్థమవుతుంది. ఇప్పటి విద్యా దిశ స్పష్టంగా మార్కుల మీదే కేంద్రీకృతమై ఉంది. పాఠశాలలు విద్యార్థులను పాఠ్యాంశాలపై కాకుండా పరీక్షలపై ఫోకస్ చేయేలా పెంచుతున్నాయి. సామర్థ్యం మించి ప్రదర్శన కోసం జరిగే పోటీ పిల్లల ఆరోగ్యాన్ని, భవిష్యత్తును ప్రభావితం చేస్తోంది.

## గురు-శిష్య సంబంధం

పాతకాలం గురుకుల పద్ధతిలో విద్యాభ్యాసం పుస్తకాల మీద ఆధారపడి ఉండేది కాదు. గురువు జీవితం బోధించే జీవమూర్తి. గురువు వద్ద విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణ, సేవాభావం, వినయం సమాజ పట్ల బాధ్యత అనే విలువల్ని నేర్చుకునేవాడు. ఈ సంబంధం క్రమంగా క్షీణిస్తూ రావడం జరిగింది. విద్యా వ్యవస్థ నాణ్యతను నిర్దేశించేది ఇప్పుడు మౌలిక సదుపాయాల సర్దుబాటు, మార్పులు, ర్యాంకులు మాత్రమే అనే నిర్ధారణకు రావడం జరిగింది. ఈ క్రమంలో గురువు కేవలం ఒక గైడ్‌గా మిగిలిపోయాడు. ఫలితంగా గురు శిష్య సంబంధం క్షీణిస్తూ గురువు పట్ల గౌరవం కోల్పోవడం మొదలయ్యింది.

## ప్రస్తుత తరం ఉపాధ్యాయులు స్థితి

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల ప్రధాన విధి బోధన మాత్రమే. కానీ నేడు గురువులు పిల్లల్ని పాఠశాలలో నమోదు చేయించడం కోసం ఊరూ వాడా తిరుగుతున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులు పాఠశాలకు పిల్లల్ని తీసుకెళ్లి జాయిన్ చేయించేవారు. ఇప్పుడు ఉపాధ్యాయులే ఇంటింటికి వెళ్లి మీ పిల్లలను "మా పాఠశాలకి పంపండి" అని వేడుకుంటున్నారు.

ఇది ఉపాధ్యాయుని గౌరవానికి, వ్యవస్థ గౌరవానికి గాయమే. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి గణాంకాలు సమర్పించడంతోనే గురువుల బాధ్యత సరిపోతోంది. పిల్లల సంఖ్య తగ్గిపోతే పాఠశాలలు విలీనమయ్యే ప్రమాదం నేపథ్యంలో ఉపాధ్యాయులు ప్రయత్నాలు చేయడంలో తప్పు లేదు. కానీ ఇప్పుడు అదే ప్రధాన బాధ్యతగా తయారయ్యింది. దీనికోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'నేను బడికి పోతా', తెలంగాణా రాష్ట్రం 'బడి బాట' అనే కార్యక్రమాలను రూపొందించాయి. ఈ రెండు కార్యక్రమాల లక్ష్యం పాఠశాలలు పునః ప్రారంభం రోజుల్లో బడికి దూరంగా ఉంటున్న పిల్లలను ఈ కార్యక్రమం ద్వారా గుర్తించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం ద్వారా బడి బయట విద్యార్థులను, బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చుతారు.

## నైతిక విద్యకు దూరం

విద్య అనే వృక్షానికి మూలాలు నైతికత. కానీ ఇప్పుడు విద్యలో నైతిక విలువలు అనే శాఖ పూర్తిగా నలిగిపోయింది. పూర్వం ఒక ఉపన్యాసం, గురువు చెప్పిన ఒక సూక్తి జీవిత మార్గదర్శకంగా ఉండేది. ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లలకు పాఠ్యాంశం తప్ప మరొకటి చేరవేయడం లేదు. ఈ క్రమంలో విద్యార్థులు జీవితాన్ని చదవటం మర్చిపోతున్నారు. పుస్తక విజ్ఞానం మాత్రమే నేర్చుకుంటున్నారు. పాఠశాల వదిలి వచ్చిన తరువాత జీవితంలోని సమస్యల్ని ఎదుర్కొనే సామర్థ్యం పొందలేకపోతున్నారు. ఆట స్థలాలు లేవు, సాంస్కృతిక కార్యక్రమాలు లేవు. మానవ సంబంధాల బదులు మార్కుల పీఠికలు పిల్లల మనసు స్పందించే హృదయంగా కాకుండా ఒక 'ఎగ్జామ్ రోబో' తయారవుతోంది. చదువుతో కూడిన జ్ఞానం మాయమైపోయింది. పిల్లలు చిన్న చిన్న సమస్యలను ఎదుర్కోలేక పోతున్నారు. సమాజంలో ఎదురయ్యే చిన్న సవాలును సైతం తట్టుకునే శక్తి లేకుండా తయారవుతున్నారు. ప్రభుత్వ విద్యను బలపరచాలంటే విద్యా సంస్థలలో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు, తరగతుల విభజన, భద్రత, మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై కఠినంగా పని చేయాలి. ప్రతి గ్రామంలో, పట్టణంలో అందుబాటులో బడి ఉండేలా చూడాలి. ఇదే విద్యను సమానత్వంగా అందించడానికి మొదటి అడుగు అవుతుంది. ప్రభుత్వాలు ఓ వైపు విద్యా ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తున్నాం అని గొప్పగా





చెప్పుకుంటూనే మరోవైపు బడులు విలీనం ప్రక్రియలు చేపడుతున్నాయి. దీనిని బట్టి ప్రభుత్వం ప్రధాన లక్ష్యం వ్యయం తగ్గించడమే అనేది స్పష్టం అవుతోంది. విద్యపై ఖర్చు పెట్టడాన్ని పెట్టుబడిగా భావించకుండా ఇదొక అనుత్పాదక వ్యయంగా భావించనంత కాలం మెరుగైన సమాజాన్ని నిర్మించలేం.. అనే సత్యాన్ని తెలుసుకున్నప్పుడే అసలైన మార్పు మొదలవుతుంది. విద్య నిజంగా హక్కుగా మారాలంటే, ప్రభుత్వ పాలసీలకు విలువ పెరగాలి. ప్రభుత్వాలు మారినా విద్యపై దృష్టి మారకూడదు. మారే ప్రతి ప్రభుత్వం ఒక కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల మౌలిక సమస్యల పరిష్కారం కాకుండా కొత్త అయోమయం ఏర్పడుతుంది. విద్యా సంస్థల పని తీరులో గుణాత్మక పురోగతి సాధించాలంటే దీర్ఘకాలిక, స్థిరమైన విధానం ఎంతైనా అవసరం. ఫీజుల నియంత్రణ, పాఠశాలల ప్రామాణికత, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల శ్రద్ధ.. ఇవన్నీ సమన్వయంతో పని చేస్తేనే విద్య రంగం మెరుగవుతుంది. ఈ విద్యా సంవత్సరం మళ్లీ మొదలవుతోంది. మారిన తరగతులు, కొత్త పుస్తకాలు, కొత్త బడులు ఇవన్నీ చూస్తున్నాం. కానీ పాత సమస్యలు కూడా అదే ఊపుతో ముందుకు వస్తున్నాయి. మార్పు ఆశించాలంటే ప్రశ్నించాలి, ప్రతిస్పందించాలి. పాలుపంచుకోవాలి. విద్య అనేది వ్యాపారం కాదు, హక్కు విద్య అనేది ఒక కుటుంబం కష్టపడి సృష్టించే భవిష్యత్తు. కానీ ఆది ప్రభుత్వాలు నిరక్ష్యం చేయలేని సామాజిక బాధ్యత కూడా తల్లి తండ్రులు పిల్లలకు భవిష్యత్తు సిద్ధం చేస్తే, ప్రభుత్వాలు సమాజానికి భవిష్యత్తు సిద్ధం చేయాలి. పిల్లల భవిష్యత్తు బాగుండాలి అని ప్రతి తల్లి తండ్రికి ఆశ. కానీ ఆ ఆశను ఆసరాగా చేసుకుని కొంతమంది కొన్ని వ్యవస్థలు తమ స్వార్థాలను తీర్చుకుంటున్నాయి. మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, సమాన అవకాశాలు.. ఇవన్నీ ఉండాలి అంటే ప్రభుత్వం విధానాలను రాజీ లేకుండా అమలు చేయాలి. తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి. ప్రైవేట్ పాఠశాలలపై నియంత్రణ అవసరం.

గతంతో పోలిస్తే నేటి ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని కీలకమైన మార్పులు కనిపిస్తున్నప్పటికీ, అవి ఇప్పటికీ సమగ్ర అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్కూళ్లకు మరమ్మతులు, మరుగుదొడ్లు, మౌలిక వసతుల అందుబాటులో కొంత మెరుగుదల కనిపిస్తోంది. ప్రభుత్వాలు కూడా "విద్య కోసం ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధం" అని బహిరంగంగా ప్రకటిస్తున్నాయి. కానీ ఈ మాటలు వాస్తవాల్లోకి రావడం లేదు. వార్షిక బడ్జెట్ కేటాయింపులో విద్యా విభాగం ఇప్పటికీ తక్కువ శాతం కేటాయిస్తోంది. విద్యా రంగానికి దేశీయ స్థాయిలో కనీసం ఆరు శాతంబడ్జెట్ కేటాయించాలి అనే నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ లక్ష్యంగా పెట్టుకున్నా, అమలు మాత్రం గాలిలో కలిసిపోతోంది. విద్య అనేది కేవలం పాఠ్యగ్రంథాలకే పరిమితం కాదు. విద్యార్థి బహుముఖ అభివృద్ధికి, క్రియాశీలతకు, సృజనాత్మకతకు దోహదపడే అంశాలు. వ్యాయామం, చిత్రలేఖనం, చేతిపనులు, సంగీతం, నాటకం.. ఇవన్నీ అవసరమే. ఆచరణలో వీటిని నిరక్ష్యం చేయడం వల్ల విద్యార్థుల్లోని అంతర్ముఖ ప్రతిభ, కళా సామర్థ్యం, వ్యక్తిత్వ వికాసం అనే అంశాలు మృగ్యమైపోతున్నాయి.

"బడి గంట మోగనున్న ఈసారైనా విద్య వ్యాపారం కాదు.. హక్కు. ఇది పిల్లల భవిష్యత్తు నిర్మాణానికి ఆధార భూతమని గుర్తించాలి. ఈ విషయమై ప్రభుత్వం ధైర్యంగా, దృఢంగా వ్యవహరించి ప్రభుత్వ పాఠశాలలకు మద్దతు ఇవ్వాలి. ప్రైవేట్ స్కూళ్లపై నియంత్రణ పెంచాలి. పిల్లల క్రీడా హక్కు, మానసిక వికాసాన్ని రక్షించాలి. తల్లిదండ్రులకు సరైన అవగాహన కల్పించాలి. ఈసారైనా మనం మేలుకోలేక పోతే రేపటి సమాజం చీకట్లోకి పడటం ఖాయమవుతుంది. విద్య అనేది కేవలం పాఠ్యాంశం కాదు.. అది ఒక జీవన ప్రమాణం. రాజ్యాంగ ఆశయాల ప్రకారం, ప్రతి చిన్నారి విద్యను ఆనందంగా పొందాలి. సమానత్వంతో పొందాలి. కానీ ఇప్పటికీ విద్య వ్యాపారంగా మారిన యదార్థం మనముందుంది. దీన్ని మార్చాలంటే, పాలకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం.. అందరూ కలిసి స్పందించాలి. పాఠశాలల్లో గంటలు మోగినప్పుడు బాల్యం బరువుగా మారకుండా ఆశగా మారేలా మన ప్రయత్నం అవసరం.

# తప్పులు లేకుండా చాటింగ్ ?

చాటింగ్ అనేది ఇప్పుడు సర్వసాధారణమైంది. ఎవరి చేతిలో చూసినా స్మార్ట్ ఫోన్. పక్కనున్న మనిషిని పలకరించకరుగానీ ఎక్కడో వున్నవారికి చాటింగ్ చేస్తుంటారు. అవసరమా, కాదా అన్నది ముఖ్యం కాదు. పిల్లలు, పెద్దలు, స్నేహితులు.. ఒకరేమిటి? ఎవరూ దీనికి అతీతులు కాదు. చాటింగ్‌లో పాటించాల్సిన కొన్ని మెళకువలు మీ కోసం..



చాటింగ్ మొదలు పెట్టే ముందు చాలా మంది 'హాయ్' 'హలో' అని మెసేజ్ చేస్తుంటారు. కొత్తవారిని అలా పలకరిస్తే బాగుంటుంది. కానీ ప్రియమైన వారికి అలాంటి మెసేజ్‌లు పెడితే.. తిరిగి రిప్లై ఇవ్వాలన్న ఆసక్తి వారిలో తగ్గిపోతుంది. వాటికి బదులు 'ఏం చేస్తున్నావు?' నీకు ఈ రోజు ఎలా గడిచింది? వంటి ప్రశ్నలు అడిగితే ఎదుటివారు వెంటనే సమాధానం చెప్పడానికి ఆసక్తి కనబరుస్తారు.

## మీరు ఊహించుకోవద్దు

చేసిన మెసేజ్‌కు రిప్లై రాకపోతే ఎదుటి వ్యక్తి నిర్లక్ష్యం చేస్తున్నారు, పట్టించుకోవట్లేదు అన్న భావనలోకి వెళ్లిపోతుంటారు. అది ఏమాత్రం మంచిది కాదు. చాటింగ్ చేస్తున్నప్పుడు ఎదుటి వ్యక్తి ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో తెలియదు. బిజీగా ఉండి రిప్లై ఇవ్వలేకపోవచ్చు. అంతమాత్రన వాళ్లు దూరం పెడుతున్నట్టు కాదని గ్రహించాలి.

## ఎదురుచూడకండి

వచ్చిన మెసేజ్ చూస్తే ఎదుటివాళ్లు రిప్లై ఇస్తారు. కానీ బదులు ఇచ్చేవరకు ఎదురు చూడటం మూర్ఖత్వం. కాసేపు ఎదురు చూసి రిప్లై రాకపోతే ఇతర పనుల మీద దృష్టి పెట్టాలి. బదులు ఎప్పుడు ఇస్తారా? అని ఎదురు చూడొద్దు. అత్యవసరమైతే కాల్ చేసి మాట్లాడటం మంచిది.

## అలాంటివి పంపించవద్దు

జీవిత భాగస్వామితో రొమాంటిక్ చాటింగ్ చేయడంలో తప్పులేదు. కానీ సమయం చూసుకోకుండా మాట్లాడటం, మెసేజ్‌లు చేయడం మంచి పద్ధతి కాదు. ఎదుటివాళ్లు ఎలాంటి పరిస్థితిలో ఉన్నారో తెలుసుకోకుండా ఫొటోలు, వీడియోలు పంపించవద్దు. వారు ఆఫీసు/ మీటింగ్‌లో ఉండొచ్చు, స్నేహితులతో ఉండొచ్చు, ఆ సమయంలో వారిని ఇబ్బందిపాలు చేయొద్దు సరైంది కాదు. ఏదైనా విషయంపై మెసేజ్‌లు చేసినప్పుడు రిప్లై రాకపోతే కాసేపు ఆగండి. ఆ తర్వాత ఎందుకు రిప్లై ఇవ్వలేదని ప్రశ్నించినా రిప్లై రాకపోతే పదేపదే మెజేజ్‌లు చేసి ఎదుట వారిని అసహనానికి గురిచేయొద్దు. మీ మొదటి మెసేజ్‌కు బదులు వచ్చే వరకు ఎదురు చూడండి. లేదా నేరుగా సమస్య ఏంటో కనుక్కోవడం ఉత్తమం.

## పొడి పొడిగా సమాధానాలొద్దు

ఓకే.. అలాగే.. అంటూ పొడిగా రిప్లై ఇస్తే ఎవరికీ నచ్చదు. ఇష్టమైన వారికి అలా పెడితే బాధపడతారు. కాబట్టి వారి మెసేజ్‌లకు తగ్గట్టుగా, ప్రశ్నలకు సంతృప్తికర సమాధానం ఇవ్వండి. వాళ్ల బదులు ఇవ్వలేకపోతే పరిస్థితిని అర్థమయ్యేలా వివరించి తర్వాత మాట్లాడతానని పొలైట్‌గా చెప్పండి.

## మీరు ఆవేశపడొద్దు

ఎదుటివారు బిజీగా ఉన్నా బద్దలిచ్చే స్థితిలో లేకపోయినా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. నన్ను నిర్లక్ష్యం చేస్తున్నావంటూ, దూరం పెడుతున్నావంటూ వారిని నిందించకండి. పదే పదే మెసేజ్/ఫోన్ చేసి వారిని ఇబ్బంది పెట్టకండి. మీరు పదే పదే వారిని విసిగించడం వల్ల మీ మీద వారికి వున్న మంచి అభిప్రాయం మారిపోవచ్చు.

## నిఘా పెట్టొద్దు

ప్రియమైన వ్యక్తులు మీ మెసేజ్‌లను పట్టించుకోవట్లేదు, బదులివ్వట్లేదు అంటే మీ బంధంలో ఎక్కడో తప్పు జరిగిందని అర్థం చేసుకోవాలి. అంతేగానీ, ఎదుటి వ్యక్తిపై నిఘా పెట్టడం, వారి గురించి ఆరా తీయడం లాంటివి చేయొద్దు. వీలైతే వారికి కొంత సమయం ఇచ్చి వాళ్ల మారతారేమో చూడాలి. లేదంటే



నేరుగా మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలి.

మెసేజ్‌లోనే మాట్లాడుకుంటే ఎలా? మీకు ఫోన్‌లో మాట్లాడాలని ఉందని ఎదుటి వారికి చెప్పాలి. వాళ్లు అంగీకారం తెలిపితే కాల్ చేసి మాట్లాడొచ్చు. చాటింగ్‌లో కన్నా ఫోన్‌లో సంభాషించడం ఎంతో ఉత్తమం.

చాటింగ్‌లో కొన్ని సార్లు మాట్లాడే మాటకు అర్థాలు మారిపోతాయి. ఫోన్‌లో మాట్లాడితే ఏ సమస్యలూ ఉండవు. మాట్లాడాలనే ఉత్సాహంతో మీరు మెసేజ్‌లు పెట్టి ఉండొచ్చు. కానీ ఎదుటి వారి నుంచి అంతే ఉత్సాహంగా బదులు రావాలని ఆశించొద్దు.

## ఈ వారం కవిత్వం



# మాటే శాసనం

ఏరు దాటాక
తెప్ప తగలేసినా
మూర్ఖ శిఖామణి అని వొదిలేస్తారు?
అనంతర తిప్పలేవో
నువ్వే మోయాల్సి వస్తోంది?
.........
కానీ పది మందిలో
ప్రపంచ వీక్షణమై
మాట నోరు దాటాక
వెనక్కు తీసుకోవటం ఏల
పొరపాటుకు
నువ్వు నాలుక కరుచుకున్నా
జరిగిన నష్టాన్ని పూడ్చలేవు.
.........
అదుపు తప్పిన ప్రయాణం
అతి వేగం
ప్రమాదానికి సంకేతం
వివేకం కోల్పోయిన మెదడు
విచక్షణ కోల్పోయిన వాక్కు
నిన్ను దిగంబరంగా నిలబెడతాయి.
నువ్వు భద్రంగా కప్పుకున్న
ఆచ్ఛాదన పెళుసులు పెళుసులుగా
రాలిపోతోంది..
కాలు జారినా.. నోరు జారినా..
మానం అభిమానం
ఛిద్రమైన చిత్రమే
.................
మాటంటే...
నిన్ను నిలబెట్టే వెన్నుదన్ను
మాటంటే...
నిన్ను నఖ శిఖం చూపించే అద్దం
మాటంటే...
నీకు నీవే రాసుకున్న శాసనం...!

- డా॥ కటుకోర్ఖ్వుల రమేష్

# మాయతెరలు



వెలుగు లేదు కాబట్టి కాదు,
ఆ వెలుగును చూడగల కళ్లే
మూసుకున్నాయి.
వాస్తవం ఎదుటే ఉంది,
మనసులు మాయల తెరల
వెనుక దాగుకున్నాయి.
......
వేసవి వేళ
నీటిచుక్క కోసం దేశం తపిస్తుంది,
వర్షపు కాలంలో వరదలు ఊపిరి
తీసుకోనివ్వవు.
ఇక్కడ నిశ్శబ్దం బతుకుతో పోటీ
పడుతుంది,
చుట్టూ కోలాహలాల మధ్య
న్యాయం కనిపించడం లేదు.
.......
పదవుల పల్లకీ స్వార్థపు చేతుల్లో
నలుగుతోంది
ఆకులే నిత్యం తినే పిల్లల దుస్థితి
పలుకుతున్నాయి.
పదవుల వర్షంలో ప్రజల
ఆకలి కథలు తడుస్తుంటే,
వెలుగు చూడని ఆశలు
వాడిపోతున్నాయి.
...........
విజ్ఞాన కేంద్రాలే
వ్యాపార మందిరాలైపోతే?
పాఠశాల గోడలపై ప్రకటనలే
పాఠాలవుతాయా?
ప్రతి మనసులో
ఓ గాయపు గుర్తు ఉంది.
దాన్ని ఉపేక్షి ంచే మౌనమే
నిత్యం వినిపిస్తోంది.
మనిషి మనిషిగా కనిపించని రోజుల్లో
మానవత్వమే గుండె చప్పుళ్ల మధ్య
కోల్పోతుందా?
ఇప్పటికైనా కళ్లను తెరిచి
చూడాల్సింది మనమే
నిప్పుల మధ్య వెలుగు
వెతకాల్సిందే మనమే.

- డాక్టర్ మామిడాల శైలజ

# నీ కోసమే నేను...

నీ పలుకే ప్రబంధం..
నీ పిలుపే సుగంధం..
సంధ్య వెలుగుల్లో స ‘వర్ణ’ దీర్ఘ సంధివి
గుణసౌశీల్యంలో సు ‘గుణ’ సంధివి...
సరస సంభాషణా చాతుర్యంలో సామజవ‘ర’
గమనవి..
అలకల కులుకుల్లో ద్విరుక్త ర‘కారా’నివి..
అక్కున చేర్చుకున్నప్పుడు ‘నాను’గాగమ సంధివి..
నా... సరిగమపదనిసల
అడుగుజాడలు నీ...వి..
నీ... మధు తరంగిణుల భావలహరులు నా..వి
అసలు గెలుపు..
ఇష్టమైన వారి చేతిలో ‘ఓడి’పోవడమే
‘క్షమ’ లేని ప్రేమ ‘ప్రేమ’ కాదు
‘ప్రేమ’ లేని చోట ప్రాణం కూడా ఉండదు
మన ప్రేమను కలిపిన ఆ క్షణం
‘మరువం’ అది ‘అమరం’ అనుభవైక వేద్యం...
చందురుని కోసం తారలు..
సూర్యుని కోసం పగళ్ళు..
నిరంతరం నీ కోసం దిగుళ్ళు..
వేసవిలో రోహిణి
వాన చినుకు కోసం ధరణి
నీ కోసం.. నేను..
ఎన్నేళ్ళూ.. ఎన్నాళ్ళూ...

- ‘ధరణి కోట’ శివరామ ప్రసాద్

# నానీలు

నగరం
ఎంత మెరిసినా,
పండుగరోజు
పల్లె ముందు బోసిపోతుంది!
....
పాపం వాడిని
ఏడవనివ్వండి,
వాడికీ
మనసుందని తెలుస్తుంది!
........
దేవుణ్ణి
రాయిగానే ఉండనివ్వండి,
లేచి వస్తే
రాయిగానే మారిపోతాడు!
..........
ఎవరి మత్తులో
వాళ్ళని ఉండనివ్వండి,
చైతన్యాన్ని
లోకం తట్టుకోలేదు!
....
మార్పు
అనివార్యమే,
కూల్చేది కాదు
నిలబెట్టేది కావాలి!

- పుట్టి గిరిధర్

# నోరూరించే వంటకాలు

## పనీర్ జిలేబీ



### కావలసిన పదార్థాలు

పనీర్ తురుము–ఒక కప్పు, ఉప్మా రవ్వ–రెండు టేబుల్ స్పూన్లు, మైదా–రెండు టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్–ఒక టేబుల్ స్పూన్, పాలు–పావు కప్పు, యాలకుల పొడి–అర టీస్పూన్, చక్కెర–ఒక కప్పు, రెడ్ ఫుడ్ కలర్–చిటికెడు, నూనె, వేయించడానికి సరిపడినంత.

### తయారు చేసే విధానం

మిక్సీ జార్‌లో పనీర్, ఉప్మా రవ్వ, మైదా, కార్న్‌ఫ్లోర్, ఫుడ్ కలర్ వేసి కొద్దికొద్దిగా పాలుపోసి ముద్దలా వచ్చేలా గ్రైండ్ చేయాలి. స్టౌ మీద పాన్ పెట్టి చక్కెర వేసి కొద్దిగా నీళ్ల పోసి పాకం పట్టుకోవాలి. పాకం వచ్చాక యాలకుల పొడి వేసి దించేయాలి. స్టౌమీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడినంత నూనెపోసి వేడి చేయాలి. పనీర్ మిశ్రమాన్ని పైపింగ్ బ్యాగ్‌లో కానీ, పాలప్యాకెట్ కవర్‌లో కానీ వేసి కాగిన నూనెలో జిలేబీల్లా ఒత్తుకుని దోరగా కాల్చుకోవాలి. కాలిన జిలేబీలను పాకంలో వేసి, అరగంట తర్వాత సర్వ్ చేసుకోవాలి.

## మామిడి , బొప్పాయి సలాడ్

### కావలసిన పదార్థాలు



సన్నగా తరిగిన మామిడి పండు, బొప్పాయి పండు ముక్కలు– ఒక కప్పు చొప్పున; పచ్చిమిర్చి–రెండు, కొత్తిమీర తురుము–ఒక టీస్పూన్, వేయించిన పల్లీలు–పావు కప్పు; ఉప్పు–తగినంత, ఆలివ్ ఆయిల్–రెండు టీస్పూన్లు; మిరియాల పొడి – పావు టీస్పూన్; వెల్లుల్లి రెబ్బలు–నాలుగు; తెల్ల నువ్వులు–రెండు టీస్పూన్లు.

### తయారు చేసే విధానం

ఒక గిన్నెలో మామిడి, బొప్పాయి ముక్కల్ని వేసి, చిన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, వేయించిన పల్లీలు, తగినంత ఉప్పు, ఆలివ్ ఆయిల్, మిరియాల పొడి, తురిమిన వెల్లుల్లి వేసి బాగా కలపాలి. చివరగా నువ్వులు వేసి మరోసారి కలుపుకొంటే నోరూరించే మామిడి–బొప్పాయి సలాడ్ సిద్ధం.

## బనానా కబాబ్

### కావలసిన పదార్థాలు



అరటికాయ–ఒకటి, శనగపప్పు–అరకప్పు, చాట్ మసాలా–చిటికెడు, ఆమ్‌చూర్–చిటికెడు, కొత్తిమీర–కొద్దిగా, ధనియాల పొడి–అర టీస్పూన్, జీలకర్ర పొడి–అర టీస్పూన్, గరంమసాలా–పావు టీస్పూన్, కారం–పావు టీస్పూన్, నూనె–వేయించడానికి సరిపడినంత; ఉప్పు–తగినంత.

### తయారు చేసే విధానం

ముందుగా అరటికాయను ఉడికించి తొక్క తీసి, ఒక గిన్నెలో వేసి చేత్తో మెదిపి ఉంచాలి. ఉడికించిన శనగపప్పును కూడా మెత్తగా మెదిపి అందులో వేయాలి. సన్నగా తరిగిన కొత్తిమీర, చాట్ మసాలా, ఆమ్‌చూర్, గరం మసాలా, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న చిన్న ఉండలు చేసుకుని పొడవుగా/వెడల్పుగా కానీ వత్తుకుని వేడి నూనెలో వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకుంటే అరటికాయ రుచికరమైన కబాబ్ సిద్ధమవుతుంది.

## ఆనపకాయ మంచూరియా

### కావలసిన పదార్థాలు

ఆనపకాయ తురుము–ఒక కప్పు; మైదా–నాలుగు టేబుల్ స్పూన్లు, కార్న్ ఫ్లోర్–ఒక టేబుల్ స్పూను; గోధుమపిండి–మూడు టేబుల్ స్పూన్లు; అల్లం–వెల్లుల్లి పేస్టు–అర టీస్పూన్; కారం–ఒక టీస్పూను; జీలకర్ర–అర టీస్పూను; ఉల్లిపాయ ముక్కలు–అరకప్పు; పచ్చిమిర్చి–ఒకటి; కొత్తిమీర తురుము–పావు కప్పు; కరివేపాకు–అయిదు రెబ్బలు; టమాటా సాస్–రెండు స్పూన్లు; చిల్లీసాస్–ఒక టీస్పూను; నూనె–సరిపడినంత; ఉప్పు–తగినంత.

### తయారు చేసే విధానం



ఆనపకాయ తురుములో మైదాపిండి, గోధుమపిండి, అల్లం–వెల్లుల్లి ముద్ద, జీలకర్ర, కారం వేసి బాగా కలపాలి. ఎక్కువ పొడిగా ఉంటే కొంచెం నీళ్ల చల్లి చిన్న చిన్న ఉండలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి.

స్టౌ మీద కడాయి పెట్టి నూనె పోసి వేడయ్యాక రెడీగా పెట్టుకున్న ఉండల్ని వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. మరో కడాయి స్టౌ మీద పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడయ్యాక ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించాలి. బాగా వేగాక చిల్లీసాస్, టమాటా సాస్, కొత్తిమీర తురుము వేసి కలిపి, ఆనపకాయ ఉండలను వేసి ఒక నిమిషం పాటు వేయించండి. ఆనపకాయ మంచూరియా రెడీ.





## నో పర్స్

కస్టమర్: హోటల్ ద్వారం దగ్గర ఒక వ్యక్తిని నియమించారు కదా! అతను లోనికి వచ్చే వాళ్ల జేబుల్లో పర్స్, డబ్బులు ఉన్నాయా? లేదా అని చూస్తున్నాడు. ఎందుకని?

యజమాని: కొంత మంది కస్టమర్స్ సుష్టుగా భోజనం చేసి అరే.. పర్స్ ఇంట్లో మర్చిపోయా.. డబ్బులు రేపు ఇస్తాలే అంటున్నారు.. అందుకని!

## బుర్ర తినకుండా..



అప్పారావు: అప్పు తీసుకున్నవాళ్లు అప్పు ఇచ్చిన వాళ్ళని చూసి పారిపోతారు కదా! మీరు అప్పు ఇచ్చి కూడా తీసుకున్న వాడిని చూసి పారిపోతారు ఎందుకు?

సుబ్బారావు: మీరు ఒకరికి అప్పు ఇచ్చే స్థాయికి ఎదిగారు కదా, ఆ వ్యాపార రహస్యాలు ఏంటి అని బుర్ర తింటూ ఉంటాడు.

**– ఎస్ కె.యాకూబ్ పాషా,**
ఖమ్మం.

## కుదరదు

క్లాస్ టీచర్: "చింటూ! నువ్వు ఎప్పుడోగానీ క్లాస్‌కి రావడం లేదు. మీ డాడీని రేపు తీసుకురా, మాట్లాడాలి!"

చింటూ: "అలా కుదరదు టీచర్. మా డాడీ కూడా ఇంటికి ఎప్పుడో కానీ రావడం లేదు".

## మా వారు ఒప్పుకోరు

నాని: "విజ్జూ, ఒక సంవత్సరం తరువాత పెళ్లి చేసుకుందాం, అప్పటివరకు సహజీవనం చేద్దామా?"

విజ్జు: "నాకు ఇష్టమే కానీ మా వారు ఒప్పుకోరు".

## అలవాటుగా..

నాగరాజు: హోటల్‌లో భోజనం చేస్తున్నంతసేపూ అన్నం సరిగా ఉడకలేదు, కూరలో ఉప్పెక్కువైంది.. అంటూ సణుగుతూ తింటున్నాడు.

అతని సణుగుడు విని సర్వర్ "ఏం సార్! భోజనం బాగా లేదా?" అన్నాడు.

"చాలా బాగుంది. కానీ ఇంట్లో రోజూ మా ఆవిడ వంట గురించి అలా చెప్పి చెప్పి అలవాటైపోయింది" అన్నాడు నాగరాజు.

## మ్యాజిక్ వస్తే..

"ఏమేవ్! నాకు మ్యాజిక్ వస్తే నిన్ను గాడిదను చేసేవాడిని" అన్నాడు భార్యతో పరమేశం.

"నాకే గనుక మ్యాజిక్ వస్తే నేను మిమ్మల్ని మనిషిగా మార్చేదాన్ని" అంది తాపీగా.

## పొగడ్డం లేదు..

కాంతం: "సావిత్రీ! ఏమైందని? ఎందుకు అంత విచారంగా ఉన్నావు" అడిగింది పక్కింటి స్నేహితురాల్ని.

సావిత్రి: "మా ఆయన తాగడం మానేసారు"

కాంతం: "మంచి విషయమేగా! ఇక సంతోషంగా ఉండొచ్చు"

సావిత్రి: "తాగినప్పుడు నా వంట బాగుందని మెచ్చుకునేవాడు. ఇప్పుడు ఎన్నో వంకలు పెడ్తున్నాడు".

## ఆఫీసనుకున్నా..

"ఏంటీ? మీసాలు మెలేస్తూ ఇంటికొచ్చారు?" అంది భార్య రమేశ్‌తో.

"ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు కిందకు దించడం మరచిపోయాను. మళ్లీ ఎప్పుడూ అలా చేయను కాంతం!" సమాధానమిచ్చాడు భార్యకు.

## రాఖీ కడుతుందని..

"గోవిందూ, కొత్త ఆఫీసర్ రాజుగారు ఈరోజు ఆఫీసుకు రాలేదేంటి?" అన్నాడు సహోద్యోగి రాము.

"స్టెనో సరోజ రాఖీ కడుతుందని భయపడ్డాడేమో!" అన్నాడు రాము.

## మీ ఆవిడే...

పేషెంట్: డాక్టర్‌గారూ! జబ్బు వివరాలతో పాటు నా ఆస్తి వివరాలు కూడా అడుగుతున్నారు? ఏమైంది? నాకేమైనా ప్రమాదమా?

డాక్టర్: మీ ఆవిడ ఆస్తి వివరాలు అడగమని చెప్పింది.

## ఒకే! కానీ..

భర్త: నీ జీతం, నా జీతం ఒకే అకౌంట్‌లో వేద్దాం అన్నాడు భార్యతో.

భార్య: అలాగేనండీ! పాస్ బుక్ మీ దగ్గర ఉంచండి. ఏటీఎమ్ కార్డ్ నాకివ్వండి.

## నాలో.. నీ రక్తం

భార్య: మీరు ఈ మధ్య కోపంగా ప్రవర్తిస్తున్నారు. ఎందుకని?



భర్త: మొన్న నాకు యాక్సిడెంట్ అయినప్పుడు నీ రక్తం ఎక్కించారుగా!

## వంట నేర్పించా!

కాంతం: నేను ఊరికి వెళ్లినప్పుడు మా వారికి భోజనం ఎలా? అనే దిగులు పోయింది వదినా అంది.

సరోజ: వంట మనిషిని పెట్టుకున్నారా?

కాంతం: లేదు, మా ఆయనకి వంట నేర్పించాను.

**– ఈ.ఎస్.మాధవన్**

# ఇరుగు-పొరుగు

సింగిల్ పేజీ కథ

నూతలపాటి వెంకట రత్నశర్మ

**ఒక్కసారిగా** పెద్దగా అరుచుకుంటూ బయటకు వచ్చాడు రాజారావు. ఆ అరుపులు విని భుజంగం కూడా బయటకు వచ్చాడు "మీ చెట్టుకొమ్మలు మా ప్రహరీగోడ దాటి వస్తున్నాయి. ఆ చెత్తా చెదారం శుభ్రం చేసుకోలేక చస్తున్నాం" అన్నాడు రాజారావు. భుజంగం, రాజారావు కుటుంబాలు ఇరుగు-పొరుగు కుటుంబాలు. వాళ్ళ మధ్య ఎప్పుడూ ఏదో ఒక సమస్య వచ్చి గొడవ పడుతుంటారు. రాజారావు అరుపులకి వీధిలో నలుగురు అక్కడ పోగయ్యారు. భుజంగమంటే కొన్నిసార్లు ఊరుకుంటాడేమో కాని అతని కొడుకు ఊరుకోడు "కొమ్మలు అటొస్తే ఏమయ్యింది. ఎప్పుడూ ఏదో వంక పెట్టుకుని కొట్లాటకు దిగుతారు" అన్నాడు, భుజంగం కొడుకు రవి.

"ఎండిపోయి రాలిపోయిన ఆకులు.. ఈ చెత్తని మీ వైపున పోస్తే తెలుస్తుంది బాధ" అన్నాడు రోషంగా రాజారావు.

"అంత ఇబ్బందిగా ఉంటే మీ వైపు కొమ్మలు నరికేసుకోండి" అన్నాడు రవి సలహా ఇచ్చినట్టు. "మీ చెట్టు, మీ యిష్టం. ఆ పనేదో మీరే చేసుకోవచ్చుగా" అన్నాడు రాజారావు.

ఈ అరుపులకి భుజంగం భార్య, రాజారావు భార్య కూడా అక్కడికి వచ్చారు. మాటకు మాట పెరిగి పరిస్థితి తిట్టుకొని కొట్టుకునే దాకా వచ్చింది. దాంతో అక్కడ చుట్టూ మూగిన గ్రామస్తులు ఇద్దరికీ సర్దిచెప్పి పంపించారు. ఆ రెండు కుటుంబాల మధ్య ఎప్పుడూ ఇలాంటి గొడవలే జరుగుతుంటాయి.



ఈ గొడవ జరిగిన పది రోజులకి బంగాళాఖాతంలో ఒక భీకర తుఫాను వచ్చింది. అది అంతకంతకు బలపడి తీరంలో నూట యాభై కి.మీ. వేగంతో గాలులు వీచటం మొదలైంది. టి.వి.లలో ప్రకటనలు చేస్తున్నారు, జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఓడరేవులలో పదవ నంబరు హెచ్చరికలు జారీ చేశారు. రాజారావు కుటుంబం టి.వి. చూస్తూ బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. ఎందుకంటే వాళ్లదో చిన్నపూరిల్లు. గాలికి ఎక్కడ పడిపోతుందోననే భయపడుతున్నారు. ఆ చిన్న ఊళ్ళో పట్టుమని పాతిక ఇళ్ళు ఉండవు. అందులో పక్కా ఇళ్లు బజారుకు ఒకటి రెండు కన్నా ఎక్కువ ఉండవు. అందుకే ఆ ఊళ్లో ఎప్పుడు తుఫాను వచ్చినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతారు. చెట్లు పడిపోవటం, పూరిళ్ల పై కప్పులు లేచిపోవటం, గోడలు నాని ఇళ్లు కూలిపోవటం సర్వ సాధారణం. అందుకే అంత భయం తుఫానంటే వాళ్లకి.

తుఫాను సాయంత్రానికి తీరం దాటుతుందని చెప్పారు కాని రాను రాను అలస్యమై ఒక రాత్రివేళకు మచిలీపట్నం తీరం దాటుతుందని ప్రకటించింది ప్రభుత్వం. దాని ప్రభావం మూడు నాలుగు జిల్లాల మీద తీవ్రంగా ఉంటుందని కూడా చెప్పింది. దాంతో రాజారావు కుటుంబం మరింత భయపడింది. ఇప్పటికిప్పుడు ఎటూ పోవటానికి సాధ్యం కాదు మరి!

చూస్తుండగానే చీకటి పడింది. గాలితీవ్రతకు కరెంటు పోయింది. గాలికి కిరోసిన్ దీపాలు కూడా వుండటం లేదు. కొంతసేపు టార్చిలైట్లు సాయంతో గడిపారు. అంతకంతకు జోరున కురుస్తున్న వాన. దానికితోడు హోరుగాలి. దిక్కుతోచని పరిస్థితి. సరిగ్గా అప్పుడే భుజంగం ఇంట్లో రాజారావు కుటుంబం ప్రస్తావన వచ్చింది.

భుజంగం భార్య రుక్మిణమ్మ భర్తతో మాట్లాడుతూ "రాజారావు వాళ్ళింటి పైకప్పు తుఫానుకి కొట్టుకుపోతుందేమో, వాళ్లని మనింట్లోకి రమ్మని పిలవరాదా" అంది సలహా ఇచ్చినట్లు.

"వాళ్లనా? ఎందుకనవసరంగా వాళ్లతో గొడవ?" అన్నాడు భర్త భుజంగం. "పోనిద్దూ! గొడవలకేంగాని. ఇబ్బంది వచ్చినప్పుడే కదా ఇరుగు-పొరుగు ఆదుకోవల్సింది" అంది రుక్మిణమ్మ. దాంతో కొంచెం మెత్తబడ్డ భుజంగం టార్చిలైటు తీసుకొని ఆ చీకట్లో రాజారావును పిలవటానికి ప్రహరీ వైపుకి వచ్చాడు. టార్చిలైటు వెలుగులోనే చెయ్యి ఊపసాగాడు వాళ్లని తనవైపుకి రమ్మన్నట్టు. ఇంత చీకట్లో.. గాలిలో భుజంగం పిలుస్తున్నాడెందుకని? అనుకుంటూ గాలి మనిషిని పడదోస్తున్నా ఎలాగోలా దగ్గరగా వెళ్లాడు రాజారావు.

"ఈ తుఫాను గాలికి చెట్లు పడిపోతాయని, పూరిళ్లు కూలిపోవచ్చని టి.వీ.ల్లో చెబుతున్నారు కదా! ఈ రాత్రికి మా ఇంటికి వచ్చి ఉండండి" అన్నాడు భుజంగం.

"సరే"నన్నాడు రాజారావు అనవసర భేషజాలకి పోకుండా. నిజానికి రాజారావుకి కూడా ధైర్యం చాలటం లేదు అక్కడ ఉండటానికి. ఇల్లు ఎక్కడ కూలుతుందోనని బెంగగా ఉన్నాడు. ఆ క్షణంలో భుజంగం దేవుడిలా కనబడ్డాడు రాజారావు కళ్లకి. రాజారావు కుటుంబం ఆ రాత్రి భుజంగం ఇంట్లో తలదాచుకుంది. తమ గొడవలన్నీ మర్చిపోయి పిచ్చాపాటి మాట్లాడుకుంటూ అర్ధరాత్రి దాటాక నిద్రకు ఉపక్రమించారు. కష్టాలొస్తేకాని మనుషులు కలిసుండరేమో! మానవ స్వభావం అంతేనేమో!!

తెల్లవారేసరికి తుఫాను తీరం దాటింది. ఈదురు గాలులు, వాన ఉధృతం తగ్గింది. తెల్లవారిన తర్వాత రాజారావు కుటుంబం తమ ఇంటికి వచ్చి చూస్తే ఏముంది? తమ ఇల్లు కూలిపోయి ఉంది. ఇంకా నయం.. రాత్రి ఇక్కడే ఉంటే తమ గతి ఏమై ఉండేది? తలచుకుంటేనే మనసు ఏదోలా అయ్యింది రాజారావు దంపతులకి. ఒకటి రెండు రోజుల్లో రాజారావు తమ ఇల్లు కప్పించుకున్నాడు. గాలివానకి పడిపోయిన చెట్లు పోగా మిగిలిన రెండు చెట్ల కొమ్మలు రాజారావు ఇంటి వైపుకి వెళ్లకుండా నరికించటానికి భుజంగం పనివాళ్లను పురమాయించాడు.

ఆ సమయానికి అక్కడే ఉన్న రాజారావు "ఉండనీలే, రెండు చెట్లేగా, కాస్త నీడన్నా ఉంటుంది" అని అనడంతో భుజంగం ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. మురుగునీరు పోవటానికి కూడ చిన్న కాలువలా తవ్వించి వాళ్ల స్థలంలోనే దూరంగా ఒక గుంట తవ్వించుకున్నాడు భుజంగం పనివాళ్లతో.

ఆ తర్వాత ఆ రెండు కుటుంబాలు ఎప్పుడూ గొడవ పడ్డట్టు కనబడలేదు ఊళ్ళోవాళ్ళకి.

# కుందేలు తెలివి

అ నగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక్క కూరమృగం కూడా లేదు. అన్ని జంతువులు హాయిగా ఆనందంగా జీవిస్తున్నాయి.

ఒక రోజున హఠాత్తుగా ఆ అడవిలోకి ఎక్కడి నుంచో ఒక ఏనుగు వచ్చి చేరింది. ఆ అడవిలోని జంతువులు హాయిగా, ఆనందంగా వుండటం చూసి అది ఓర్వ లేకపోయింది. వాటిని భయంతో వణికిపోయేలా చేయాలని ఆ అడవిలో బీభత్సం చేయటం ప్రారంభించింది.



ఆ ఏనుగు ధాటికి తట్టుకోలేక ఆ అడవిలోని జంతువులన్నీ తెలివైన కుందేలు దగ్గరకు వెళ్ళి, "ఈ రోజున ఎక్కడ్నుంచో ఒక ఏనుగు వచ్చి అడవిలో బీభత్సం చేస్తోందని వివరించి చెప్పి, కాపాడమని" వేడుకున్నాయి.

"మీరు చెప్పేదాకా నాకు ఈ సంగతి తెలియదు. మీరు ఇక్కడే వుండండి, దాని పీడ వదిలించి వస్తాను" అని కుందేలు ఒక్కతే ఏనుగుని వెతుక్కుంటూ వెళ్ళి, ఏనుగు చేస్తున్న బీభత్సం కళ్లారా చూసి "మీ బలం గురించి అడవిలో జంతువులు చెబుతుంటే నేను నమ్మలేకపోయాను. మీ బలాన్ని నేను కళ్ళారా చూడాలనుకుంటున్నాను. మీకు ఒక చెట్టుని చూపిస్తాను దాన్ని మీ తొండంతో చుట్టి, అటూ ఇటూ, వూపి మీ పరాక్రమం నిరూపించుకోండి. అప్పుడు నేను కళ్లారా చూసి నమ్మి అడవిలోని జంతువుల్ని ఒప్పించి, మిమ్మల్ని ఈ అడవికి రాజుని చేసి, ఆ జంతువులకు మీకు సేవలు చేసే భాగ్యం కల్పిస్తాను" అని ఆశ పెట్టింది. ఆ మాటకి ఏనుగు ఆనందపడి "ఎక్కడ చెట్టు చూపించు" అని పొగరుగా పలికింది.

కుందేలు ఏనుగుని తీసుకెళ్ళి, ఆ చెట్టుని చూపించి, దూరంగా వెళ్ళి పొదల చాటున దాక్కొని చూడసాగింది. ఆ ఏనుగు ఆ చెట్టుని తన తొండంతో చుట్టి, అటూ ఇటూ వేగంగా వూపింది.

అంతే..! ఆ చెట్టు మీది తేనెతుట్టెలోని తేనెటీగలన్నీ ఒక్కసారిగా లేచి, ఆ ఏనుగుని ఎడాపెడా కుట్టడం మొదలు పెట్టాయి. ఈ హఠాత్తు పరిణామానికి ఏనుగు హడలిపోయి, ఆ భాధ తట్టుకోలేక, ఆ అడవిని వదిలి దూరంగా పారిపోయింది. ఏనుగు పీడ వదిలినందుకు కుందేలు సంతోషించి, జంతువుల దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించి చెప్పింది.

ఆ జంతువులు కుందేలు తెలివిని ఎంతగానో మెచ్చుకొని, ఏనుగు పీడ వదిలినందుకు ఆనందంతో నృత్యం చేసాయి.

**- మా.శ్రీ. రాజు, పాల్వంచ**




## బాలగేయం

# వానలు కురవాలి

వానా వానా రావాలి...
వాకిట ముందు
కురవాలి..
చల్లగా మేం వుండాలి..
ఎంచక్కా ఆడుకోవాలి..
...
మొక్కలు బాగా
పెంచాలి...
ఆకుకూరలు తినాలి..
ఆరోగ్యంగా వుండాలి..
మంచి గాలి తగలాలి..
...
పంటలు బాగా పండాలి
ధాన్యం ఇంటికి చేరాలి
పౌష్టిక విలువలు
పెంచాలి..
సకల రోగాల్ని తరమాలి.
...
ప్రకృతి పచ్చగా
మెరవాలి..
ఆహ్లాదంగా గడపాలి..
చెట్లను ఏపుగా పెంచాలి..
వర్షాన్ని రమ్మని
పిలవాలి..

- నరెద్దుల రాజారెడ్డి



# హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**సరళ, తెనాలి**

**ప్రశ్న: పండ్లు త్వరగా ఎలా పండుతాయి?**

**జవాబు:** సాధారణంగా పండ్లలో 'ఇథిలీన్' అనే వాయువు ఉత్పత్తి అవుతుంటుంది. ఆ వాయువే పండ్లు బాగా పండేందుకు కారణమవుతుంది. పండ్ల రకాలను అనుసరించి ఈ వాయువు వివిధ స్థాయిలలో ఉంటుంది. ఉదాహరణకు అరటి పండ్లలో చాలా తక్కువ స్థాయిలోనూ, ఆపిల్స్‌లో ఎక్కువ స్థాయిలోనూ ఈ వాయువు ఉంటుంది. మామిడి పండ్లను, ఇతర రకాలనూ త్వరితంగా పండించేందుకు ఇథిలీన్ వాయువును ఉపయోగించేందుకు రసాయనాలు వాడుతున్నారు. ఈ రసాయనాల ద్వారా ఇథిలీన్ వాయువు పుట్టి ఈ పండ్లను త్వరగా పండించడం ద్వారా వాటిని తింటే అనారోగ్యం కలుగుతుంది. ప్రకృతి సహజంగా పండినవే ఆరోగ్యానికి క్షేమకరం. ఆపిల్ పండ్లతో కలిపి వుంచితే ఏర్పడిన పండుదనం కొంతలో కొంత మేలు. సాధారణంగా అరటిపండ్లు చాలా త్వరగా పండుతాయనే ఉదేశంతో కొంచెం పచ్చిగా ఉండగానే కొంటుంటాం. అయితే బాగా పచ్చిగా ఉన్న అరటిపండ్లలో కొన్నింటిని విడిగా వుంచి, మరికొన్నిటిని ఆపిల్స్‌తో కలిపి బుట్టలో వుంచండి. మరుసటి రోజున పరిశీలిస్తే, విడిగా వున్న పండ్లు ఏమీ మార్పు లేకుండా గట్టిగా, ఆకుపచ్చ రంగులోనే ఉంటాయి. ఆపిల్స్‌తో కలిపి వుంచిన పండ్లు మాత్రం పసుపు పచ్చరంగులోకి మారి పండివుంటాయి.

**నవ్య, విజయవాడ**

**ప్రశ్న: మనకూ, నక్షత్రాలకు మధ్య వున్న దూరాన్ని ఎలా కొలుస్తారు?**

**జవాబు:** నక్షత్రాల నుంచి వెలువడుతున్న కాంతిని స్పెక్ట్రోమీటర్ (వర్ణమాపకం)లో అమర్చివున్న ప్రిజమ్ (పట్టకం) ద్వారా వెలుపలికి ప్రసరింపజేయాలి. అప్పుడు ఏర్పడే కలర్ స్పెక్ట్రమ్‌లో ఉండే రంగుల కాంతి స్థాయిని అనుసరించి నక్షత్రాల దూరం కనుక్కోవచ్చు.

# బహుళ ప్రయోజనాల ఫూల్ మఖాన

తామర గింజలు.. ఫూల్ మఖానాగా పిలుచుకునే ఈ గింజలలో ఉండే పోషకాలు ఆరోగ్యాన్ని ఇస్తాయి. వీటిని 'ఫాక్స్ నట్స్' అని కూడా అంటారు. తామర గింజలలో ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, కార్బోహైడ్రేడ్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని కొందరు పచ్చిగానే తీసుకుంటే మరికొందరు ఉడకబెట్టుకుని తింటుంటారు. ఇంకొందరు వేయించుకొని పొడి చేసుకుని పాలల్లో కలుపుకుని తీసుకుంటూ ఉంటారు. ఇంకొందరు వీటితో స్వీట్లు కూడా తయారు చేస్తారు. ఎలా తీసుకున్నప్పటికీ తామర గింజలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఫూల్ మఖానాతో బాగా బరువు తగ్గుతారు. దీనిలో ఉండే ప్రోటీన్, ఫైబర్ ఆకలి కాకుండా చేస్తుంది. ఫలితంగా ఆహారాన్ని తక్కువగా తీసుకుంటాం.



## అధిక బరువు నియంత్రణ

వీటిలో ప్రోటీన్లు, ఫైబర్‌తో పాటు కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉంటాయి. రక్తహీనత, జీర్ణ సంబంధిత సమస్యలను తలెత్తకుండా చేస్తాయి. ఫూల్ మఖానాలో ఉండే మెగ్నీషియం నరాల పనితీరును మెరుగు పరుస్తుంది. సాధారణంగా మనం కాల్షియం పొందడానికి పాలు, పెరుగు, వెన్న మొదలైన వాటిని తీసుకుంటాం. తామర గింజలలో కూడా సంబంధిత కాల్షియం లభిస్తుంది. ఈ కాల్షియం ఎముకలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. కాబట్టి కీళ్ల నొప్పుల సమస్యతో బాధపడేవారు దీన్ని తినడం వల్ల ప్రయోజనం పొందుతారు.

తామర గింజ(లోటస్ సీడ్స్)ల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్‌లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మనలను ఎన్నో రోగాల నుండి కాపాడతాయి. ఇవి గుండెజబ్బులు, కేన్సర్, డయాబెటిస్, ఆర్థరైటిస్ తదితర సమస్యల నుండి మనుషులను కాపాడతాయి. తామర గింజలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల ఇవి డయాబెటిస్‌ను నియంత్రిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. మలబద్దకంతో బాధపడేవారికి ఇది మంచి ఆహారం. గర్భిణిలకు సైతం మేలు చేస్తుంది. వారిలో రక్తహీనత సమస్య రాకుండా చేస్తుంది. ఇవి కీళ్ల సమస్యలతో పాటు, దంత సమస్యలతో బాధపడే వారికి బాగా పనిచేస్తాయి. ఎముకలను, దంతాలను దృఢంగా మారుస్తాయి, బిపిని నియంత్రిస్తాయి. ముదురు గోధుమ, తెలుపు రంగుల్లో ఉండే ఈ తామర గింజలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఉత్తర భారతదేశంలో వీటితో స్వీట్స్ కూడా తయారు చేసుకుంటారు.

తామర గింజలు ఎండిన వాటికంటే పచ్చివాటిలోనే పోషక విలువలు ఎక్కువగా ఉన్నాయి. ఈ గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ గుండె జబ్బులు, కేన్సర్ కారకమయ్యే ఫ్రీరాడికల్స్‌ను దరిచేరకుండా చేస్తాయి. ఇందులో ఉండే పీచు పదార్థం బరువు తగ్గేందుకు దోహదపడుతుంది. ఈ గింజల్లో పొటాషియం ఎక్కువగా ఉండడం వలన దీనిని ఆహారంగా తీసుకుంటే బీపీని నివారించవచ్చు.

## ప్రయోజనాలు

రక్తహీనతతో బాధపడేవారికి తామర గింజలు ఒక మందుగా పని చేస్తాయి. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. తామర గింజలను నెయ్యిలో వేయించి తింటే ఆహారం తేలికగా జీర్ణమవుతుంది. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఇది చాలా మంచిది. వీటిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. మఖానాను వేయించడం వల్ల త్వరగా, స్థిరమైన శక్తిని అందిస్తుంది. అందుకే ఉపవాస సమయాల్లో దీన్ని అల్పాహారంగా ఆస్వాదిస్తారు.

నెయ్యిలో వేయించిన మఖానా తినటం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇది ఫ్రీ రాడికల్స్, ఆక్సీకరణ ఒత్తిడి నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. నెయ్యిలో వేయించిన తామర గింజలు అద్భుతమైన, ఆరోగ్యకరమైన స్నాక్‌గా పనిచేస్తుంది. ఇందులోని తక్కువ కొవ్వు, అధిక ప్రోటీన్ కంటెంట్ బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. మఖానాను నెయ్యిలో వేయించడం వల్ల దాని పోషక విలువలు మరింత పెరుగుతాయి. కాబట్టి ఈ ఆహారం సమతుల్యమైన, పోషకమైన చిరుతిండిని అందిస్తుంది. తామర గింజలలోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి, ముడతలు, ఫైన్ లైన్స్ వంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి. చర్మం తేమను నిలుపుకోవడంలో సహాయపడతాయి, దానిని హైడ్రేట్‌గా మృదువుగా ఉంచుతాయి. తామర గింజలలోని ప్రోటీన్లు, విటమిన్లు జుట్టు కుదుళ్లను బలపరుస్తాయి. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. తామర గింజలు తలకు రక్త ప్రసరణను ఇవి జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తాయి. ఈ గింజలలోని యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు చిన్న వయసులోనే తెల్లబడకుండా వుండేందుకు సహాయం చేస్తాయి. లోటస్ గింజలు సాంప్రదాయకంగా పురుషులు, స్త్రీలలో సంతానోత్పత్తిని పెంచడానికి ఉపయోగిస్తారు. లోటస్ గింజలు స్పెర్మ్ కౌంట్, పురుషుల సంతానోత్పత్తిని మెరుగు పరుస్తాయి. ఇవి హార్మోన్ల సమతుల్యతను నియంత్రించడంలో, అండాశయ పనితీరును మెరుగు పరచడంలో సహాయపడతాయి. మఖానాలోని శాంతపరిచే గుణాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఒక గ్లాసు పాలలో కొన్ని తామర గింజలు వేసి మరిగించిన పాలను రాత్రి పడుకునే ముందు తీసుకుంటే ప్రశాంతమైన నిద్ర పడుతుంది.

**- ఆనంద 'మైత్రేయ'మ్**

## నానో చార్జర్

అరచేతిలో తేలికగా ఇమిడిపోయేలా దాదాపు పెన్‌డ్రైవ్ పరిమాణంలో ఉండే పరికరం నానో చార్జర్. చైనీస్ కంపెనీ యాంకెర్ దీనిని ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. వంద వాట్ల సామర్థ్యంతో పనిచేసే ఈ చార్జర్‌ను ఎక్కడికైనా తేలికగా తీసుకుపోవచ్చు. కేవలం అరవై గ్రాముల బరువుండే ఈ చార్జర్ జేబులో ఇట్టే ఇమిడిపోతుంది. దీనికి ఉన్న యూఎస్‌బి-సి పోర్టు ద్వారా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను చార్జ్ చేసుకోవచ్చు. క్యాంపులకు, పిక్నిక్‌లకు వెళ్లేటప్పుడు ఇది బాగా ఉపయోగపడుతుంది. సాధారణ చార్జర్ల కంటే ఈ నానో చార్జర్ ఎలక్ట్రానిక్ పరికరాలను శరవేగంగా చార్జ్ చేస్తుంది. దీని మన్నిక కూడా సాధారణ చార్జర్ల కంటే ఎక్కువగానే ఉంటుందని తయారీదారులు అంటున్నారు.




## సౌర మ్యూజియం



చరిత్ర ఆనవాళ్లను భద్రపరిచే మ్యూజియం మనల్ని గతంలోకి తీసుకెళుతుంది. అయితే కోల్‌కతాలో నిర్మించిన సోలార్ మ్యూజియం మాత్రం భవిష్యత్ పరిణామాల్ని చూపిస్తుంది. ప్రస్తుతం మనం తీసుకునే కొన్ని జాగ్రత్తలు ముందు ముందు సమాజానికి ఏ విధంగా మంచి చేస్తాయో చూపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఓ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుందీ మ్యూజియం.

దాదాపు రెండువేల సోలార్ ప్యానెళ్లతో డోమ్ ఆకృతిలో నిర్మించిన ఈ మ్యూజియం పర్యావరణం, ఇంధన వనరుల గురించి అవగాహన కల్పిస్తుంది. దానికి అమర్చిన ప్యానెళ్ల నుంచి ఉత్పత్తి అయ్యే సౌరవిద్యుత్‌తోనే మ్యూజియం నడుస్తుంది. లోపలున్న ఎఐ టెక్నాలజీ సందర్శకులకు ఎన్నో విశేషాలు చెబుతుంది. షార్ట్ ఫిల్ములు చూపిస్తుంది. సందేహాలను నివృత్తి చేస్తుంది. అడుగడుగునా తిప్పి చూపడానికి రోబో గైడ్లు ఉంటాయి. అంతేకాదు.. ఇంటరాక్టివ్ డిస్‌ప్లేలు వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచుతాయి.

## అలంకారం

అవసరమైన వస్తువుల్ని పట్టుకెళ్లడానికి అమ్మాయిల దగ్గరకు చేరిన హ్యాండ్‌బ్యాగ్ ఓ ఫ్యాషన్ వస్తువుగా మారింది. అది కూడా అలంకరణలో భాగమైంది. ఒకవైపు సౌకర్యాన్ని, మరోవైపు అందాన్ని కలగలుపుతూ తయారీదారులు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. లెదర్ నుంచి మొదలైన బ్యాగు అందం రకరకాల రూపాల్లో కనిపించి ఇప్పుడు క్రిస్టల్ మెరుపుల వరకు చేరింది.

మెరిసే జిగురు లాంటి ఎపాక్సీ, కాంతుల క్రిస్టల్స్‌ని ఉపయోగించి వీటిని తయారు చేస్తున్నారు. రంగురాళ్ల చెమక్కులు బ్యాగుకు ప్రత్యేక లుక్‌ను అందిస్తాయి. అందుకేమరి.. ఈ హ్యాండ్‌బ్యాగ్‌ను చూసినవారు ఎవరైనా 'అబ్బ ఎంతబాగుందో! అదిరిపోయిందిగా' అని అనకుండా ఉండలేరంటే నమ్మాల్సిందే!



## కరిగిపోని ఐస్‌క్రీమ్



ఎంతసేపైనా కరిగిపోని కారిపోని ఐస్‌క్రీమ్‌ని, పెద్ద చాకుతో కోసి వడ్డించే ఐస్‌క్రీమ్‌ని ఎక్కడైనా చూశారా? చూడలేదంటే తుర్కియే వెళ్లి అక్కడి వీధుల్లో దొందుర్మ పేరుతో అమ్మే ఐస్‌క్రీమ్ రుచి చూడాల్సిందే మరి.

ఎక్కడ చూసినా పనీర్, టోఫు మాదిరి కనిపించే ఓ పొడవాటి పదార్థం వేలాడదీసి కనిపిస్తుంది. ఆర్కిడ్ వేర్ల నుంచి సేకరించిన పిండిని మేకపాలతో కలిపి ప్రత్యేకంగా తయారు చేసే ఐస్‌క్రీమ్ అది. ఆ పిండివల్లే అది కరగదు. పొరలు పొరలుగా ఉండే ఆ ఐస్‌క్రీమ్‌ను తినాలంటే చాకుతో కోసి ప్లేటులో పెట్టి ఇస్తారు. ఫోర్కుతో కట్ చేసుకుని స్పూన్‌తో తినవచ్చు. భలే ఉందిగా ఈ వెరైటీ ఐస్‌క్రీమ్.

కథ

# ఆలస్యం అమృతం విషం

దేగల అనితాసూరి

**"అమ్మా, నాకెందుకో ఇతన్ని లవ్ చేసి నేను పెద్ద తప్పు చేసాననిపిస్తోంది" నెత్తీ, నోరు బాదుకుని ఎంత చెప్పినా పెడచెవిన పెట్టి మరీ తల్లితండ్రులని ఏడ్పించి, నానా చేసి ఎట్టకేలకు అంతా తప్పనిసరై ఒప్పుకుని పెళ్లి చేసి అత్తారింటికి పంపిన నెల రోజుల తరువాత ఫోన్ లో ఆ కూతురన్న మాటలివి.**

**"ఏమిటే.. నెత్తిన బాంబుపేల్చే మాటలంటున్నావ్! పెళ్లికి మూడేళ్ళ ముందు నుంచే అతన్ని ప్రేమించానన్నావ్! మరిప్పుడేమైంది?" ఆందోళనగా అడిగింది తల్లి జాహ్నవి.**


"అవునమ్మా.. మూడేళ్ళు ప్రేమలో ఉన్నప్పుడు రోజు ఆఫీసులో చూసుకోవటం, అరగంటో గంటో మాట్లాడుకునేవాళ్ళం. అది కాదంటే ఏ వాట్సప్‌లోనో, ఫేస్ బుక్ లోనో చాటింగ్ చేయటమే తప్ప దగ్గరగా ఇలా కలిసి జీవించడం మొదలైంది పెళ్లి తరువాత కదమ్మా" అంది అపూర్వ.

"సరే.. లవ్ మ్యారేజ్ అయినా అరేంజ్డ్ మ్యారేజ్ అయినా అమ్మాయికి పెళ్లయ్యాక అత్తవారింట్లో అన్నీ కొత్తగానే ఉంటాయి. కొత్త చోటు, కొత్త మనుషులు, కొత్త పద్ధతులు కదా? నెమ్మదిగా అర్థమౌతాయి. అంతవరకూ ఓపికపట్టు" చెప్పింది జాహ్నవి.

"అది కాదమ్మా, మనుషులు, పద్ధతులు కాదు. ఇతనే పెద్ద మూర్ఖుడు. వాళ్లమ్మ ఏం చెబితే అది వింటాడు. మా పెళ్లి కూడా నాలాగే పెద్దవాళ్లకు నచ్చజెప్పి చేసుకున్నాడనుకున్నా. ఇప్పుడు తెలిసింది. ఒకట్రెండు సార్లు మా ఆఫీస్ స్టాఫ్‌లో ఎవరిదో బర్త్ డే, మ్యారేజ్ డేలలో నన్ను చూసి-

"అమ్మాయి బాగుంది. పైగా మీ ఆఫీసులోనే ఉద్యోగం చేస్తోంది కూడా. ఎలాగైనా నా కోసం నువ్వా అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలి.. అని వాళ్లమ్మ చెబితే చేసుకున్నాడట. రెండు రోజుల ముందే ఈ విషయం చెప్పాడు తెలుసా?" అంది అపూర్వ ఆవేదనగా.

"అయ్యుండొచ్చు.. అప్పూ. పెళ్లి అయిపోయింది కదా, నెమ్మదిగా సర్దుకుపోవటానికి ట్రై చెయ్. వాళ్లమ్మ కోసమే అయినా, తనకూ నువ్వంటే ఇష్టం ఉండబట్టి కదా మమ్మల్ని ఒప్పించి చేసుకున్నది. ఈ కాలం అమ్మాయిలకి అన్నీ తొందరే. ప్రేమించడమూ, పెళ్లి చేసుకోవటం, ఆనక నచ్చలేదనటం. భార్యా భర్తలు ఒకరికొకరు అన్ని విషయాలూ నచ్చే కాపురం చేయరు. రాన్రానూ నీకే అన్నీ అర్థమవుతాయిలే. వుంటా మరి" ఫోన్ కట్ చేసింది జాహ్నవి.



"ఏమిటి? పొద్దుటే తల్లీ కూతుళ్ల ముచ్చట్లు? అది, వాళ్లాయనా ఆఫీసులకెళ్లాలి కదా? తీరుబడిగా పెళ్లి కాక ముందులా కబుర్లాడుతూ కూర్చుంటే వాళ్లత్తగారేమనుకుంటారు" అంది డైనింగ్ టేబుల్ దగ్గర ఫోను సంభాషణ వింటూ ఇడ్లీలు తింటున్న జాహ్నవి అత్త విజయలక్ష్మి.

"కొత్త చోటు కదా, కాస్త అలవాటు పడే వరకూ కొంచెం బెంగ ఉంటుంది కదత్తయ్యా. మరికొన్నాళ్లు అయితే మనమే ఫోన్ చెయ్యమన్నా తీరిక లేదంటుంది" కూతురి గురించి అత్తగారు ఏమనుకుంటుందోనని సర్ది చెప్పింది, జాహ్నవి.

ఈ కాలం పిల్లలకు కొత్త, బెంగ అన్నవి కూడా తెలుస్తున్నాయా తల్లీ! అంత తెలిసినదైతే సొంతంగా పెళ్లికొడుకుని వెదుక్కునేది కాదులే కానీ, ఏమిటట దాని గోల? అప్పుడే మొగుడు, అత్త నచ్చకపోయారని అంటున్నట్టుంది? పొరపాటునైనా నువ్వు మాత్రం "అయితే అత్తగారిల్లొదిలి వచ్చేసెయ్, మేమున్నాం అంటూ భరోసాలివ్వద్దు. తరువాత దాని కాపురం బాగుపడదు" అంటూ కోడల్ని హెచ్చరించింది విజయలక్ష్మి.

..............

"అమ్మాయినీ, అల్లుడుగార్ని తొలి పండుగ కదా వదినగారూ, తీసుకెళ్దామని వచ్చాం" చెప్పింది జాహ్నవి అపూర్వ అత్తగారు సరస్వతితో.

"దాందేం భాగ్యం వదినా, తీసుకెళ్లండి. మేమెందుకు అడ్డు చెబుతాం? ఏమీ అనుకోనంటే ఒక మాట. మీ అమ్మాయికి కాస్త ఒకింటి కోడలయ్యాక ఎలా వుండాలో నేర్పి పంపండి" అంటూ ముఖం చిట్లించి చెప్పింది.

జాహ్నవి భర్త అయోమయంగా భార్య వంక చూశాడు.

ఆమె మీరాగండి.. అన్నట్టు చూసి "అదేమిటి వదినా అలా అంటారు? మన కాలంలోలాగా ఇంట్లో ఉన్న కోడల్ని కాదుగా మీరు కోరి తెచ్చుకున్నది. మీ అబ్బాయితో సమానంగా ఉద్యోగం చేస్తున్నప్పుడు కాస్త లేటుగా లేవటాలు, ఆఫీసు నుంచి లేటుగా రావటాలు తప్పదు కదా!" అంది జాహ్నవి.

"ఎంత లేటుగా ఇంటికొస్తే మాత్రం, ఉదయంపూట కాకుంటే కనీసం సాయంత్రాలైనా పూజగదిలో దీపం వెలిగించొద్దా? వంటలైతే అస్సలు చేతకావట్లేదు. ఉప్పు, కారాలు ఎక్కువో తక్కువో చేసి పాడుచేస్తోంది" అంది సరస్వతి.

"దానికి చదువు, ఉద్యోగమంటూ వంట నేర్చుకునే సమయం ఎక్కడ ఉండిందని? పెళ్లికి ముందు నేర్పాలనుకునేలోపే మా ప్రమేయం లేకుండా పెళ్లి ప్రస్తావన మీ వైపు నుంచేగా వచ్చింది? కూతురిలా భావించి మీరే కాస్త మెల్లగా నేర్పుకోవాలిగానీ, పండుగ కోసం మా ఇంట్లో ఉండే ఒకట్రెండు రోజుల్లో నేనేం నేర్పుతాను వదినగారూ!" అంటూ ఏమాత్రం తగ్గకుండా సమాధానం ఇచ్చింది జాహ్నవి.

"అయినా యథా రాజా.. తథా ప్రజా అని అబ్బాయి తల్లితో మీరింత నిక్కచ్చిగా మాట్లాడుంటే ఇక మీ అమ్మాయి మాకు మర్యాద ఇస్తుందా?" అంది ఉక్రోషంగా సరస్వతి.

"మిమ్మల్ని ఎదిరించి తనేం మాట్లాడిందమ్మా? మీరన్నదానికి సమాధానం చెప్పడాన్ని తప్పు పడుతున్నారు" అన్నాడు జాహ్నవి తండ్రి కృష్ణమూర్తి.

"అయ్యో అయ్యో! చూశావట్రా మనమే కోరి చేసుకున్నామని మీ అత్తగారికి నేనెంత అలుసైపోయానో" అంటూ కొడుకుతో చెప్పి రాగాలు తీస్తూ ముక్కు చీదింది సరస్వతి కొడుకు మీద ఆఖరి అస్త్రం ప్రయోగిస్తూ.

"అపూర్వా! ఏమిటిది? ఇదేనా పండక్కు రమ్మని పిలిచి విధానం? వియ్యపురాలు అన్న మర్యాదైనా లేకుండా మీ పేరెంట్స్ మా అమ్మను ఎంతెంత మాటలంటున్నారో చూశావా? అంతా నీ అలుసు చూసుకునే కదా. పండుగ లేదు ఎండుగ లేదు నేను రావట్లేదు, నువ్వూ వెళ్లటానికి వీల్లేదు" చెప్పేసి సర్రున తన గదిలోకి వెళ్లిపోయాడు అపూర్వ భర్త హర్ష.

అపూర్వ కూడా భర్త వెంటే గదిలోకెళ్లి గదిలోకెళ్లి సూట్‌కేస్ తీసుకుని బట్టలు సర్దుకుంటూ "మీరంటే మీ అమ్మ దగ్గరే ఉన్నారు. నేను వెళ్లేది ఇకపైన పండుగలు, ముఖ్యమైన వాటికే కదా? దానిక్కూడా వద్దనే అధికారం మీకు లేదు. నేను వెళ్తున్నా.. అంతే" అనేసి అమ్మా నాన్నలతో కలిసి బయలుదేరింది.

"అదికాదే, మరోసారి అల్లుడ్ని పిలిచి చూస్తా. కాస్త కోపం తగ్గాక వస్తాడేమో" అంది జాహ్నవి.

"వాళ్ళు అంతే అమ్మా. అడిగికొద్దీ మరింత బెట్టు చేస్తారు. నువ్వేం పట్టించుకోకు" అని పుట్టిల్లు చేరింది.

..............

"అది చిన్నపిల్ల. భర్త మీద, అత్తమీద అలిగి వస్తే మాత్రం అల్లుడు రాకుండా ఒక్కదాన్ని మీరు ఎలా తీసుకొస్తారు? నలుగురికి తెలిస్తే పరువు పోతుంది. మొన్న పెళ్లైంది. ఇంతలోనే వచ్చి పుట్టిల్లు చేరిందని నవ్వుకుంటారు. వెంటనే నీ అత్తగారింటికి వెళ్లిపో అప్పూ. పుట్టింటికి వస్తే మీ ఆయనతో కలిసి రావాలి" అంటూ బలవంతంగా పంపేసింది వరలక్ష్మి.

అత్తగారిని ఎదిరించి తనకు సపోర్ట్ చేస్తుందనుకున్న తల్లి కూడా సైలెంట్‌గా ఉండటంతో నిరాశగా వెళ్లింది అపూర్వ.

..............

"పుట్టింటి ఆవరణ లేదని తెలిసాక అపూర్వ కూడా కష్టపడి వంటపని, ఇంటిపని అన్నీ నేర్చుకుంది. అయినా సరే తిట్టే నోరు, తిరిగే కాలు ఊరుకోదన్నట్టు సరస్వతి ఏదో ఒక విషయంలో సాధిస్తూనే ఉండేది. అపూర్వ ఏటీఎంకార్డ్ కూడా ఎప్పుడూ హర్ష జేబులోనే ఉండేది. భార్య ఎంత చేసినా కనీసం సంతోషించేవాడు కాదు. అలాగే తల్లి ఒక్క మాటన్నా వెంటనే దిప్పిపొడిచేవాడు.

పిల్లినైనా గదిలో వేసి కొడితే ఎదురు తిరుగుతుందన్నట్టు అపూర్వ కోపం తారాస్థాయికి చేరింది. ఏటిఎం కార్డు తీసేసుకుని దాచిపెట్టుకుంది. నా వంట నేను చేసుకుంటాను, మీ ఇద్దరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు" అంటూ రివర్స్‌లో గొంతెత్తి తిరస్కరించసాగింది.

"ఒరే హర్షా, ఈ పిల్లని చేసుకుంటే వాళ్లమ్మా, నాన్న తరువాతైనా బాగా కట్నకానుకలు ఇస్తారనుకున్నా. అదేం జరగలేదు పైగా జీతం కూడా ఇవ్వనంటోంది. ఇలాంటి పిల్ల మనకెంచుకని డైవోర్స్ ఇచ్చి వెళ్లగొడదామంటే దాని నాయనమ్మ ఇక్కడికే పంపుతోంది. నీకు ఇంకో పెళ్లి చేసి భారీగా కట్నం తెచ్చుకుంటే మనం హాయిగా ఉండొచ్చు, కాబట్టి, నేను చెప్పినట్లు వింటావా?" అంది నెమ్మదిగా కొడుక్కి ఉపదేశిస్తూ.

ఆ కొడుకు స్వీయ నిర్ణయాలు తీసుకోలేని వాజమ్మ కనుక "అలాగే, చెప్పమ్మా నువ్వేం చెప్పినా నా మంచి కోసమేగా" అన్నాడు.

**"ఎంత లేటుగా ఇంటికొస్తే మాత్రం ఉదయంపూట కాకుంటే కనీసం సాయంత్రాలైనా పూజగదిలో దీపం వెలిగించొద్దా? వంటలైతే అస్సలు చేతకావట్లేదు. ఉప్పు, కారాలు ఎక్కువో తక్కువో చేసి పాడుచేస్తోంది" అంది సరస్వతి.**

"రేపు అది బట్టలు ఆరబెట్టడానికి బాల్కనీలోకి వెళ్తుంది కదా. నువ్వు సమయం చూసి వెనుక నుంచి నెట్టేయ్. తరువాత ఏడ్చి పెడబొబ్బలు పెట్టి అదో యాక్సిడెంట్ కేసు అని నమ్మిద్దాం. రెండు మూడు నెలలకు విషయం పాతబడ్తుంది. నీకు మళ్లీ పెళ్లి చేస్తా" అంది, సరస్వతి పైశాచికంగా ముఖం పెట్టి.

ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా? అన్నట్లు ఎదురు చూస్తూ నిద్రపోయింది సరస్వతి. ఉదయాన్నే కొడుకు గాభరాగా తల్లి గదిలోకి వచ్చాడు "అమ్మా... అమ్మా! అపూర్వ కనిపించట్లేదు" అంటూ. "ఇంకెక్కడికి పోతుందిరా? మళ్లీ అమ్మ మీదో నాన్న మీదో గాలి మళ్లిందేమో! అక్కడికే వెళ్లుంటుంది. ఇలాంటప్పుడు పట్టించుకోకుండా ఉండకు. ఎంతో ప్రేమ నటిస్తూ వెళ్లి-

"రమ్మని, పువ్వుల్లో పెట్టి చూసుకుంటానని చెప్పి తీసుకురా, ఎవరికీ అనుమానంరాదు" అని చెప్పింది.

"అలాగే" అంటూ వెళ్ళాడు హర్ష.

తల్లి చెప్పినట్టే చిలుకపలుకులు వల్లించాడు.



"అలాగే హర్షా, వచ్చేస్తుందిలే కూర్చో. నీతో పంపకుండా నేను ఊరుకుంటానా? ఇన్నాళ్లకొచ్చింది కదా ఇవ్వాల్సిన చీరె సారెలిచ్చి పంపుతాం తీసుకెళ్తువుగానీ కూర్చో" అంది వరలక్ష్మి నవ్వుతూ.

కృష్ణమూర్తి టీవీ చూస్తూ కూర్చున్నాడు.

జాహ్నవి, విజయలక్ష్మి వంటింట్లో బిజీగా ఉన్నారు.

హర్ష లేచి సెల్ ఫోన్ తీసుకుని తలుపు తీసుకుని బయట నిలబడి తల్లికి కాల్ చేశాడు.

"అమ్మా, వీళ్లు ఇప్పుడప్పుడే పంపేలా లేరు. నాకేమో ఆఫీసుకి టైమైపోతోంది. ఎలా?" అని అడిగాడు.

"పర్వాలేదు. ఒక్కరోజు లీవు పెట్టొచ్చులే. అక్కడే వుండి సాయంత్రానికైనా తీసుకురా" చెప్పింది సరస్వతి.

"సరే" అనేసి లోపలికెళ్ళాడు హర్ష.

"ఇక బయలుదేరుతాం మామయ్యా నేను అర్జెంట్‌గా ఆఫీసుకెళ్ళాలి" చెప్పాడు హర్ష అసహనంగా.

"అలాగే వెళ్దువుగానీ పద మిస్టర్ హర్షా" అంటూ ఒక ఇన్స్‌పెక్టర్, ఇద్దరు కానిస్టేబుల్స్ ఇంట్లోకి వచ్చారు.

"ఎవరు మీరు? ఎక్కడికి పదమంటున్నారు?" సన్నగా కాళ్లు వణుకుతుంటే మేకపోతు గాంభీర్యంతో అన్నాడు హర్ష.

"నీకోసం ఇంకో అత్తారిల్లు ఎదురు చూస్తోంది, అక్కడికి" చెబుతూనే అతన్ని జీపు ఎక్కించి పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లిపోయారు.

అరగంటలో అతని తల్లి కూడా మరో సెల్‌లో ఊచలు లెక్కించసాగింది.

"ఈ కాలం అమ్మాయిలు నీలాగా ధైర్యంగా ఉండాలి. ప్రేమ పెళ్లిల్లు అయినా, పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు అయినా ఇలాంటి కట్న పిశాచాలు, పైశాచిక అత్తలు వుంటూనే ఉంటారు. అయినా సహనం, పరువు, చావైనా, బతుకైనా అత్తారింట్లోనే అనుకోకుండా కంప్లైంట్ చేసి మంచి పని చేసావు" అంటూ అపూర్వను మెచ్చుకున్నాడు ఇన్స్‌పెక్టర్.

"కానీ, ఇంకా సమాజంలో నాలాంటి చాదస్తం బామ్మలు కూడా మారాల్సి ఉంది ఇన్స్‌పెక్టర్‌గారూ. నా కోడలు కనీసం కొన్నాళ్ళ కోసం నా మనవరాల్ని ఇంటికి తీసుకొచ్చినా నేనే ఒప్పుకోకుండా పంపేశాను. ఆ రోజు మా అపూర్వ తన సెల్ ఫోన్‌లో వీడియో కాల్‌లో తన భర్త రాత్రంతా వాళ్లమ్మతో కలిసి ఎలా అపూర్వను చంపాలనుకుంటున్నారో, తరువాత ఎక్కువ కట్నంకోసం మరో పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్న విషయం, అతను తూచా తప్పకుండా పైకి కలవరించే అలవాటుండటంతో స్వయంగా చెప్పడాన్ని అంతా రికార్డ్ చేసుకొచ్చి చూపితేగానీ నా కళ్ళు తెరుచుకోలేదు" బాధతో కళ్లు తడి అవుతుంటే అంది వరలక్ష్మి.

"పాత కాలంలాగా ఇంకా మనం చూస్తూనే ఉంటాం. అత్తింట్లోనే నీ బతుకు. ఒకవేళ ఎప్పుడైనా రావాల్సి వచ్చినా జంటగానే, అత్తింటివాళ్ల అనుమతితోనే రావాలని అంటుంటారు. తీరా ఏదైనా జరగరానిది జరిగాక ఏడిస్తే ప్రయోజనం ఉండదు. అయినా, ఈ కాలం ఆడపిల్లలు సొంత కాళ్ల మీద నిలబడి బతకగలుగుతున్నప్పుడు వాళ్లను ఒత్తిడి చేసి ఇష్టంలేని వ్యక్తి ఆగడాలకు బలి చేయటం పేరెంట్స్ చేస్తున్న పెద్ద తప్పు. మాలాగే అడపిల్లల్ని అర్థం చేసుకుని చేరదీసి పేరెంట్స్ మరింత మందిని కాపాడుకోవాలని భావిస్తున్నా. నాకు తెలిసిన వాళ్లక్కూడా ఇదే సలహా ఇస్తా. తరువాత అన్ని విధాలా నచ్చితే మరొకరిని పెళ్లి చేసుకున్నా, చేసుకోకపోయినా ఆత్మ విశ్వాసంతో బతుకుతారు" అన్నాడు కృష్ణమూర్తి కూతురి తల ప్రేమగా నిమురుతూ.

వాళ్లకు వీడ్కోలు చెప్పి జీపులో నేరుగా బయలుదేరాడు ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ పోలీస్‌స్టేషన్‌కి కాదు.. చాలా రోజులుగా అత్త-మామలు, ఆడపడుచు బాధలు పెడుతున్నా ఎలాగైనా వాళ్లతో కలిసి మెలిసి ఉండటానికి ప్రయత్నించమంటూ తన భార్య వచ్చిన ప్రతిసారి బుజ్జగించి వెనక్కు పంపిన తన గారాల కూతుర్ని ఇంటికి తెచ్చుకోడానికి.

---

# అందాయి




**నానీ కపోతాలు (కవిత్వం)**
రచన: చింతా రాంబాబు
కార్తీక్ అండ్ నిహాల్ ప్రచురణలు
ప్రతులకు: 5-199,
కాత్రినికోన పోస్ట్ అండ్ మండల్
నడవపల్లి రోడ్
భాగీరతమ్మ తల్లి టెంపుల్ దగ్గర,
కాత్రేనికోన,
బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా;
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

**జిమ్ కార్బెట్ రచనలు చంపావత్ పులి**
కందుకూరి రవీంద్రనాథ్(తెలుగులో)
ప్రతులకు: కందుకూరి రవీంద్రనాథ్
8-43/3/బి,
శ్రీనివాసా కాలనీ మెయిన్ రోడ్
ఉప్పల్ పోస్ట్, హైదరాబాద్-29

**చిరుకథల చిద్విలాసం (పోస్ట్‌కార్డు కథలు)**
సంపాదకులు: జి.వెంకటరెడ్డి
ప్రతులకు: జి.వెంకట రెడ్డి
బి70/ఎఫ్1, పి.ఎస్.నగర్
విజయనగర్ కాలనీ, హైదరాబాద్
తెలంగాణ

**తెలుగు దివ్వెలు**
(మన కళాకారులు)
సంపాదకులు:
వి.ఎస్.రాఘవాచారి
ప్రతులకు: కళాదీపిక
తిరుపతి

**మసన చెన్నప్ప సమగ్ర సాహిత్యం**
రచన: ధూళిపాళ అరుణ
ప్రతులకు: ధూళిపాళ దత్తాత్రేయ శర్మ
హరిహర త్రిశక్తి క్షేత్రం
వలిగొండ-508 112
యాదాద్రి జిల్లా.




# తొలి నాళ్లలో తెలుగు నవల

**ఆంగ్ల** సాహిత్య ప్రభావంతో తెలుగులో నవల అవతరించింది. ఇటలీ భాషలో వున్న నావెల్లి అంటే అర్థం ఫ్రెష్ స్టోరీ. అమెరికన్ రచయితలు నవలను పాకెట్ థియేటర్ అన్నారు. నవల వాస్తవానికి దగ్గరగా పాశ్చాత్య రచయితలు జీవిత సమస్యలు, సంఘటనలు ప్రతిబింబింపచేసారు. తెలుగులో గద్య వాఙ్మయ సృష్టికర్త కందుకూరి వీరేశలింగం, ఆంగ్ల వాఙ్మయాన్ని సంఘ సంస్కరణ దృష్టితో తెలుగు గద్యంలోకి అనువదించారు. 'వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్' ఛాయగా రాజశేఖర చరిత్ర, గలివర్స్ ట్రావెల్స్‌కు అనుకరణగా సత్యరాజాపూర్వ దేశ యాత్రలు, ఆడమళయాళము రచించారు. షేక్స్‌పియర్ నాటకాలను కథలుగా, నాటకాలుగా గద్యంలోకి అనువదించారు. ఆంధ్రపత్రిక వార సంచికలలో 'కౌంట్-డి-మోంటీ క్రిస్టో', 'టేల్ ఆఫ్ టు సిటీస్' ఆంగ్ల, ఫ్రెంచ్ నవలల అనువాదాలు క్రమేపీ వచ్చాయి. పడవ మునుక, ప్రేమాశ్రమ్, గోదాన్ వంటి బెంగాలీ, హిందీ నవలలు, రష్యన్ నుండి తెలుగులోకి అనువాద నవలలు వచ్చాయి. నాటి అనువాదకులలో వేంకట పార్వతీశ్వర కవులు, మాడపాటి హనుమంతరావు, తల్లావఝుల శివశంకర శాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావు, గుండిమెడ వేంకట సుబ్బారావు, కొడవటిగంటి కుటుంబరావు, బొందలకుంట శివరామకృష్ణ ఎందరో వున్నారు. పాలీ భాష నుంచి దుగ్గిరాల బలరామకృష్ణయ్య, కిళాంబి రంగాచార్యులు, రష్యన్ జపాన్ అనువాదకులుగా ప్రయాగ కోదండ రామశాస్త్రి, శ్రీ శ్రీనివాస చక్రవర్తి, హిందీ నుండి నెల్లూరి కేశవస్వామి, అట్లూరి పిచ్చేశ్వరరావు తదితరులు పెక్కు గ్రంథాలు అనువదించారు. ఆంగ్ల, వంగ ప్రసిద్ధ గద్య సాహిత్యం తెలుగులోకి పరివర్తింపబడింది. ఆంగ్లంలోని అలెగ్జాండర్ డ్యూమాస్, చార్లెస్ డికెన్స్, స్కాట్, థాకరే, స్టీవన్‌సన్ రచనలు, వంగభాషలోని శరత్, బంకించంద్ర, పాంచకడీదేవ్, రవీంద్ర, ద్విజేంద్రలాల్ రచనలు, కానన్‌డేల్(షెర్లాక్ హోమ్స్) సుప్రసిద్ధ అపరాధ పరిశోధక నవలలు తెలుగులో వచ్చాయి.

ఈ అనువాద రచనల విషయంలో వేంకట పార్వతీశ్వర కవులకు మనం ఎంతో రుణపడి వున్నాం. చిలకమర్తి లక్ష్మీనరసింహం రాజస్థాన్ కథావళిని, ఆంగ్ల, బెంగాల్ నవలలను అనువాదం, అనుసరణలతో రాసారు. 1918లో విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల ఆరంభం నుంచి, ఆరు సంవత్సరాలు పైగా తెలంగాణలో ఒద్దిరాజు సోదరులు నవలలను రచించి ప్రచురించారు.

తెలంగాణ సీమలో నవల ప్రక్రియ 1860లోనే పుట్టింది. నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతంలోని తడకమళ్ళ కృష్ణారావు కంబుకంధర చరిత్ర తెలంగాణ నుంచి వచ్చిన మొదటి నవల. 1860లో ఆయన 'కామరూప కథ' కూడా రాసారు. ఈ రెండు రచనలలో ఆధునిక నవలా లక్షణాల బీజాలు కన్పిస్తున్నాయని తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్రలో డా॥ ముదిగంటి సుజాతారెడ్డి పేర్కొన్నారు. 1872లో నరహరి గోపాలకృష్ణమ శెట్టి రాసిన రంగరాజ చరిత్ర, 1878లో వీరేశలింగం రచన రాజశేఖర చరిత్ర కంటే ముందే, తెలంగాణ ప్రాంతంలో నవలా లక్షణాలున్న ఈ రెండు రచనలు వచ్చాయి. గోపాలకృష్ణమ శెట్టి తన రచనను 'నవీన ప్రబంధం' అని పిలిస్తే,కందుకూరి తన రచనను 'వచన ప్రబంధం' అన్నారు. తడకమళ్ళ కృష్ణారావు కూడా తన రచనలను వచన ప్రబంధంగా పేర్కొన్నారు. ప్రాచ్యలిఖిత భాండాగారంలో రాతప్రతుల వర్ణనాత్మక పట్టికలో, వాటిని 'నవల లాంటిది' అనే వుందిట. ఆ తర్వాత తడకమళ్ళ కృష్ణారావు 1872 తర్వాత 'తెలుగు వెలుగు ముగ్ధ కథ' అనే వచన ప్రబంధాన్ని రచించారు. 1922 నాటికి ఈ వచన ప్రబంధ ప్రక్రియకు నవల అన్న పేరు స్థిరపడింది.

శేషభట్టరు వేంకట రామానుజాచార్యులు 'ప్రాకృత దాంపత్యం' అనే నవల రాసి ప్రచురింపచేసారు. 1922కు పూర్వమే ఒద్దిరాజు సోదరులు నవలలు రాసారు. ఒద్దిరాజు సోదరులలో ఒకరైన సీతారామచంద్రరావు 1918లో రుద్రమదేవి చారిత్రక నవల రచించారు. ఒద్దిరాజు సోదరులు 1910 దశకంలోనే మంచి చారిత్రక, సాంఘిక నవలలు రచించారు. సురవరం ప్రతాపరెడ్డి 'శుద్ధాంతకాంత' అముద్రితం కాగా 'ఆరెవీరులు' నవల మధ్యలో ఆగిపోయింది. చరిత్ర పాత్రల అధ్యయనం, నాటకీయంగా పాత్రల చిత్రణ, మౌలిక చారిత్రక నవలలకు ఒద్దిరాజు సోదరులు ఆద్యులు. తెలుగు సాహిత్యంలో సహజంగా తొలి దశకాలలో, నవల లాంటి వచన ప్రబంధాలు క్రమేపీ నవలా సాహిత్యం వెల్లివిరిసే అవకాశాలకు దోహదం చేసాయి.

పోరాట ఉద్యమాలకు ఊపిరి పోసిన తెలంగాణా సీమలో పాటలు, కథలతో పాటు నవలలు కూడా చాలా వచ్చాయి. 1930 ప్రాంతంలో పైడిమర్రి వెంకట సుబ్బారావు కాలభైరవుడు, దేవరకొండ సోదరులు సయ్యద్ అలీ అజ్మతుల్లా, యిద్దరూ 1945-60 మధ్య కాలంలో సుశీల, సుజాత, మణి, రంపరాకాసి, జాహ్నవి అనే సాంఘిక నవలలను రాసారు. అంతకుముందే వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి' తెలంగాణా పోరాట నవలల్లో మొదటిది. తెలంగాణ జన సామాన్య జీవనం, యథార్థ సామాజిక వేదన, వాస్తవికత చిత్రిస్తూ సీక్వెల్‌గా వారి గంగు అసంపూర్ణ అద్భుత నవల. తెలంగాణ రచయితలు తమ చారిత్రక అస్తిత్వ వైభవాన్ని తొలి తరంలోని ప్రతిభావంతులు సామాజిక, రాజకీయ, సాహిత్య నేపథ్యంలో ప్రజా పోరాటాలతో మమైకమై తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు.

**- జయసూర్య**

# సృష్టిలో దేని విలువ దానిదే!

ఆయన ఓ సాధువు. ఓ సముద్ర తీరాన ఆయన కూర్చుని చల్లటి గాలిని ఆస్వాదిస్తున్నారు. అప్పుడు అక్కడికి ఓ రైతు వచ్చాడు. సాధువుకు నమస్కరించి "అయ్యా! నాకో మంచి మాట చెప్పండి" అన్నాడు.

"నీ సమస్యేంటీ? నీకు నేనేం చెప్పాలి?" అని అడిగారు సాధువు. రైతు కొంచెం ఆలోచించి నాకు చాలా మంది మిత్రులున్నారు. వారిలో తొంభై శాతం మందికి ఎకరాలకు ఎకరాల భూమి ఉంది. అందరూ నాకన్నా ధనవంతులే. లక్షలు సంపాదిస్తున్నారు" అన్నాడు.

అక్కడితో ఆగకుండా ఆ రైతు "కానీ నేను ఓ పేద రైతును. నాకు ఓ అర ఎకరం భూమి మాత్రమే ఉంది. మిత్రులందరి మధ్య నేను అతి సామాన్యుడిలా అనిపిస్తుంటుంది. వారందరూ ఎంతో ఎత్తున ఉంటే నేనేమో నేల మీద ఉన్నట్టే అనిపిస్తుంది. ఇలా అనిపించినప్పుడల్లా నేనెంతో నలిగిపోతాను" అని అన్నాడు.

రైతు చెప్పిన మాటలన్నీ విన్న సాధువు తనకు అసలు విషయం అర్థమైనట్టుగా అతని వంక చూశారు. "నా పక్కన కూర్చో" అన్నారు సాధువు. "పరవాలేదు స్వామీ, నేనిలానే నిల్చుంటాను" అని అన్నాడు రైతు. "ఏం పరవాలేదు. కూర్చో నాయనా!" అని సాధువు చెప్పడంతో రైతు "సరేనని" ఆయన పక్కన కూర్చున్నారు. "చూశావా? మనిద్దరం ఓ బండరాతిపైన కూర్చున్నాం కదూ" అన్నారు సాధువు. "అవును" అన్నాడు రైతు. "మన చుట్టుపక్కల బోలెడన్ని చిన్నరాళ్ళు ఉన్నాయి. అలాగే సముద్ర తీరాన ఇసుక చూడు. అలలు తీరానికి వచ్చి పదే పదే తడుపుతుంటాయి ఇసుకను. ఇసుకను దాటి చూస్తే మన కంటికి కనిపించే దూరం వరకూ సముద్రముంది కదూ" అని అన్నారు సాధువు. "అవును స్వామీ, మీరన్నట్టే సముద్ర జలాలు కంటికి కనిపిస్తున్నాయి. అలాగే మన చుట్టూ గులకరాళ్లూ, గవ్వలూ, ఇసుక రవ్వలు.. ఇలా ఎన్నో కనిపిస్తున్నాయి. అన్నాడు రైతు. దీనిని బట్టి మనం తెలుసుకోవలసిదేమిటంటే- దేవుడి సృష్టి ఆశ్చర్యకరం. ప్రపంచంలో నానా రకాల వస్తువులు ఉంటాయి.



ఉపయోగపడనివంటూ ఉండవు. ప్రతిదానికీ ఏదో ఒక ప్రయోజనం ఉంటూనే ఉంటుంది. అంతమాత్రాన ప్రకృతిలో ఉన్న చిన్న వస్తువులన్నీ బాధ పడుతున్నాయా? లేదుగా! కనుక ఉన్నంతలో సర్దుకుపోవడం ప్రధానం. అటువంటి వారే ప్రశాంతంగా జీవించగలరు" అని చెప్పారు సాధువు.

# వడ్డించడమూ ఓ కళే..

ఒకరిని భోజనానికి పిలిచినప్పుడు వారికి చక్కటి వంట పదార్థాలు చేసి పెట్టడం ఎంత ముఖ్యమో అలాగే వాటిని వడ్డించడం అంతకనాన ముఖ్యం.

కవి సార్వభౌముడు శ్రీనాథుడు. ఏదో ఒకటి తయారు చేసి కడుపునిండా పెట్టామనుకోవడం కన్నా ఎంత ప్రేమగా, ఎంత ఆప్యాయంగా పెట్టామన్నది ప్రధానం. తల్లులకైతే తమ పిల్లలతో ఎలా తినిపించాలో బాగా తెలుసు. వారికి తెలిసినంతగా నాన్నలకు అంతగా తెలీదు. కాశీఖండంలో శ్రీనాథుడు ఓ చోట వడ్డన తీరుని చక్కగా వర్ణించాడు. అది ఎప్పటికీ అనుసరణయమే. పెద్దలకు అన్నం పెట్టడంలోనూ సాధువులకు భిక్ష వేయడంలోనూ ఆ పద్ధతి పాటించడం వల్ల పెట్టే మనసుకెంత తృప్తి కలుగుతుందో వేరేగా చెప్పక్కర్లేదు. ముంగిట గోమయంబున గోముఖము దీర్చి....గ్రమకరముల బ్రాహ్మణాంగనలు కాశీ నన్నపూర్ణభవాని కట్టనుగు జెలులు" అనే సీస పద్యంలో అంటాడు శ్రీనాథుడు. తొలుత ఆవు పేడతో అలకాలి. నాలుగు వైపుల ముగ్గుకర్ర పెట్టాలి. ముగ్గ కర్ర అంటే తిన్నగా సరళ రేఖలు గీయాలి. అవి ఏం చెప్తాయంటే ఈ ప్రాంతానికి ఇదే సరిహద్దు అని తెలియజెప్తాయి. అనంతరం వచ్చిన అతిథిని అక్కడ నిల్చోమని చెప్పాలి. షోడశోపచారాలతో పూజించాలి. ఆ తర్వాత గరిటతో అన్నం మీద నెయ్యి పోయాలి. వండిన పదార్థాలను భక్తితో విశ్వాసంతో తృప్తిగా వడ్డించాలి. దీన్నే మధుకర భిక్ష ఇచ్చే పద్ధతి అంటారు. ఇక ఇదంతా అయిన తర్వాత అతిథులకు భోజనం పెట్టే సమయంలో వారి పంక్తి మధ్యలోకి ఇంటి యజమాని వచ్చి అన్నం వడ్డించాలి. ఇలా ఉండగా, వడ్డించిన విస్తరిలో ఉన్న పదార్థాలను తమ నిత్యార్చన మూర్తికి నివేదించి మరీ భుజిస్తారట ఆస్తికులు అని శ్రీనాథుడు హరవిలాసం అనే తన కావ్యంలో చెప్పాడు.

అతిథులకు భోజన సమయంలో ప్రశాంతంగా భుజించటానికి వట్టివేళ్ళ విసనక్రరతో వీచాలట. ఈ మర్యాదను దమయంతి పెండ్లిరోజు అనే ఘట్టంలో వర్ణించాడు శ్రీనాథుడు. అసలు వడ్డించడం అనేదొక కళ. దానికెంతో నేర్పరితనం అవసరం. వడ్డించే పదార్థాలతో పాటు అభిమానాన్ని కూడా రంగరించాలి. ఏదో ఒకటి పెట్టడం కాదు. ఎంత తృప్తిగా పెట్టామన్నది ముఖ్యం. ఇక్కడ ఓ విషయం చెప్పుకోవాలి.

భోజన కార్యక్రమం ఆనందంగా ఆహ్లాదంగా సాగాలంటే పెట్టే వారే కాదు, తినే వారు కూడా అలాగే నడచుకోవాలి. ఆబగా తినడమో రుసరుసలాడుతూ తినడమో చేయకూడదు. అది సరైన పద్ధతి కాదు. తింటున్నప్పుడు రుచుల గురించి చెప్పకూడదట. ఎందుకంటే అధిక శాతం మందికి రుచులు చెప్పడం సరిగ్గా తెలీదు. తనకు సరిగ్గా లేదనుకున్న రుచి మరొకరికి బాగుండొచ్చు. కనుక తను తిననంత మాత్రాన ఏదో ఒకటి చెప్పి తినాలనుకున్న వారితోనూ తిననివ్వకుండా చేయడం భావ్యం కాదంటాడు శీనాథుడు.

**- యామిజాల జగదీశ్**

# 'వాస్తు కత్తెర్లు' అంటే ఏమిటి?

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458

– ఎస్.కనకం, విజయవాడ


**ప్రశ్న: "వాస్తు కత్తెర్లు" అంటే ఏమిటి? అది ఒక దోషమా? వాస్తు కత్తెర్లు ఉన్నప్పుడు ఇల్లు కట్టకూడదంటారు. ఇంకా ఏమేం పనులు చేయకూడదు? ఏయే పనులు చేయవచ్చు?**

**జవాబు:** 'వాస్తు కర్తరి' అనే పదానికి వికృతి 'వాస్తు కత్తెర్లు'. అంతేగానీ వాస్తు కత్తెర్లు అనేదేదీ లేదు. సూర్యుడు భరణి నక్షత్రం 3,4 పాదాల్లో; కృత్తిక నక్షత్రం 1,2,3,4 పాదాల్లో; రోహిణి నక్షత్రం 1వ పాదంలో సంచారం చేస్తున్నప్పుడు జరిగిన కాలాన్ని 'కర్తరి' అనే పేరుతో వ్యవహరిస్తారు. ఈ సమయంలోనే 'వాస్తుకర్తరి'గా కూడా వ్యవహరిస్తారు. వాస్తు కర్తరిలో గృహ నిర్మాణాలు, శంకుస్థాపనాదులు మొదలైనవి చేయకూడదు. శాస్త్ర సమ్మతం కాకుండా వాస్తు కర్తరిలో గృహ నిర్మాణలు, శంకుస్థాపనాదులు చేసినట్లయితే అవి అగ్నిహోత్రుడికి ప్రీతికరం అవుతాయని కొన్ని వాస్తు గ్రంథాలలో పేర్కొన్నారు.

ఏదేమైనప్పటికీ వాస్తుకర్తరీ సమయంలో వాస్తు సంబంధమైన పనులు ప్రారంభించినట్లయితే ఫలితాలు అనుకూలంగా ఉండవన్న మాట సత్యదూరం కాదని గమనించాలి. లగ్నమునందు శుభ గ్రహమున్నా, గురువు 12వ ఇంట ఉన్నా, 2వ ఇంట చంద్రుడు కానీ, శుభగ్రహాలు కానీ ఉంటే కేంద్ర లేక కోణములందు గురు, శుక్రులలో ఒకరున్నా, కర్తరిని కలుగజేసే గ్రహం నీచ స్థానంలో ఉన్నా కర్తరీ దోషం లేదు.

'వాస్తు కర్తరీ' సమయంలో చేయకూడని పనులు అనేకం ఉన్నాయి. వాస్తుకర్తరీలో వ్యవసాయం ప్రారంభించటం, విత్తనాలు వేయటం, భూమిని తవ్వటం, గృహం నిర్మించటం, చెట్లు నరుకుట, నార తీయటం, ద్వారబంధాలు తయారు చేయటం, ద్వార బంధాలు నిలబెట్టడం.. మొదలైన కలప సంబంధ కార్యాలు కూడా నిషేధం.

ఇంకా క్షౌరం, గృహ ప్రవేశం, నూతన ఆసనాలపై కూర్చోవటం, నూతన మంచాలపై పడుకోవటం,



నూతన స్త్రీ సమాగమం, అశ్వారోహణం, దేవాలయ పనులు నిషిద్ధాలుగా పేర్కొన్నారు.

## 'వాస్తకర్తరీ'లో చేయాల్సిన పనులు ఏవి?

'వాస్తుకర్తరీ' కాలంలో ఉపనయనాలు, వివాహాలు చేయవచ్చు. యజ్ఞగుండాలు, మండపాలు కట్టవచ్చు. మరొక విషయం ఏమిటంటే– 'గృహకర్తరీ' అనే మాట కూడా వాస్తు శాస్త్రంలో ఉన్నది. అయితే 'వాస్తు కర్తరీ', 'గృహ కర్తరీ' రెండు ఒకే రకమైన కర్తరీలు కావు. రెండింటికి భేదమున్నది. సూర్యగమనాన్ని బట్టి ప్రత్యేకంగా పేర్కొనబడింది వాస్తుకర్తరీ. అయితే ఒక గృహానికి తూర్పు, ఉత్తర దిక్కుల నున్న నేలమట్టం పెరిగి వున్నట్లయితే, ఆ గృహానికి కలిగే దోషాన్ని 'గృహ కర్తరీ' దోషం అంటారు. 'గృహ కర్తరీ' దోషాన్ని సవరించుకొనే అవకాశముంది. 'వాస్తు కర్తరీ'లో చేయదగిన కార్యాలు ఉంటాయి. ఆ నియమం పాటించాల్సిదే. 'వాస్తు కర్తరీ'లో చేయకూడని కార్యాలు, చేయదగిన కార్యాలు ఉంటాయి.

## ఏ ముఖద్వారం మంచిది?

ఎస్ – కొత్తగూడెం

**ప్రశ్న: మాకు ఏ ముఖం ద్వారం ఉన్న ఇల్లు పనికొస్తుంది?**

**జవాబు:** మీ వ్యవహార నామ రీత్యా మీకు ఉత్తర ముఖద్వారం లేదా ఉత్తర ఈశాన్య ముఖద్వారమున్న ఇల్లు చక్కగా యోగిస్తుంది. ఉత్తరం వీధి ఉన్నప్పుడే ఉత్తర ముఖద్వార యోగం చాలా బాగుంటుంది.

ఒకవేళ 'ఫ్లాట్' కొన్నట్లయితే మొత్తం కాంప్లెక్స్‌కి వీధులు ఎటు దిక్కుకు వున్నప్పటికీ, మీ ఫ్లాట్ ముఖద్వారం ఉత్తర లేదా ఉత్తర ఈశాన్యానికి ఉంటే చాలు. ఖాళీ స్థలం కొంటే– ఉత్తరాన వీధి ఖాళీ స్థలాలు, ప్లాట్లు కొనడం వల్ల శుభ ఫలితాలుంటాయి.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ........................................
పుట్టిన తేది : ........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .............
చిరునామా:...............................................

– ఊరకనే వచ్చిందని ఉబలాటపడితే మొదటికే మోసం రావచ్చు. ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చేవారు ఊరకే ఏం చేయరు.

– కోట్లు కొల్లగొట్టినవాడు కొంచెం జ్ఞానాన్ని కూడా తస్కరించలేడు.

# పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..

**"ప్రకృతి మన అవసరాలను మాత్రమే తీరుస్తుంది. మన కోరికలను కాదు..!" అంటారు మహాత్మా గాంధీజీ.**

యావత్ ప్రపంచం గాంధీజీ ప్రవచించిన ఈ మాటలను గుర్తు చేసుకుంటూ, ఆ మార్గంలో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుతుండడం వల్ల సహజ వనరులు తగ్గుతున్నాయి. వాతావరణంలోని అనూహ్య మార్పులు భూతాపానికి కారణమై సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. ధృవ ప్రాంతాల్లోని మంచుకొండలు అవలీలగా కరిగిపోతున్నాయి. ఎడారీకరణ విస్తరిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. జీవ వైవిధ్యం తగ్గిపోవడం, కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, అడవుల సంఖ్య తగ్గిపోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించకపోవడం, ఓజోన్ పొరకు చిల్లులు పడటం.. ఇలాంటివన్నీ కలిసి ప్రకృతి వైపరీత్యాల ప్రళయ తాండవాలను కళ్లారా చూస్తున్నాం.



ఇది ఇలాగే కొనసాగితే నేటి ఆధునిక నవ తరానికి, భవిష్యత్ తరాలకు సంబంధించిన మానవ మనుగడ ఉనికే ప్రశ్నార్థకం. పరిశుభ్రతను పాటించకపోవడం వల్ల ఓ సందర్భంలో ప్రకృతి కొవిడ్ వైరస్ రూపంలో కన్నెర్ర చేస్తే ఆక్సిజన్ అందక కొన్ని కోట్ల ప్రాణాలు తల్లడిల్లాయి. అయినా మనం ఇంకా మారటం లేదు. మన బాధ్యతలను నిర్వర్తించడం లేదు. మన అంతిమ స్థానం ఆరడుగుల నేల అనే విషయాన్నే మర్చిపోయాం. ప్రశాంతతను పంచాల్సిన ప్రకృతే, మనకు ప్రాణాలను పోసే పర్యావరణమే కాలుష్యం మాయలో, కాలపు ఆటలో మానవాళిపై తీవ్రంగా విరుచుకుపడుతున్న తరుణమిది. పంచభూతాల సాక్షిగా ఋతువులు గతి తప్పి తమ గమనాన్ని మార్చుతుంటే మనమంతా వెంటనే మేలుకోకపోతే కోలుకోవడం ఇక చాలా కష్టం. పర్యవసానపు పరిణామాలు భయంకరంగా ఉంటాయి. అభివృద్ధి చెందిన దేశాలు శాస్త్ర సాంకేతిక హద్దుల మాయలో ప్రకృతిలోని పంచభూతాలతో స్నేహం చేయడం మరిచినట్టు ఉన్నాయి. అందుకే అప్పుడప్పుడు పర్యావరణం బుసలు కొట్టడం మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు పర్యావరణ పరిరక్షణ మనందరి కర్తవ్యం.

ఈసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5 సందర్భంగా యు ఎన్ఈపిథీమ్ "Combating Plastic Pollution Globally"తో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది. ఈసారి ఈ వేడుకలు రిపబ్లిక్ ఆఫ్ కొరియా కేంద్రంగా ఘనంగా నిర్వహించనున్నారు. కొరియా రిపబ్లిక్ ఈ వేడుకలు నిర్వహించడం ఇది రెండోసారి. 1997లో మొదటిసారి "ఫర్ లైఫ్ ఆన్ ఎర్త్" అనే నినాదంతో పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడం, పునరుద్ధరించేటువంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. తదనంతరం ఎన్నో కార్యక్రమాల వల్ల అక్కడ గాలి, నీటి స్వచ్ఛతను పెంచగలిగింది. వివిధ రకాల కాలుష్య స్థాయిని తగ్గించగలిగారు అక్కడి ప్రజలు. ఇప్పుడు యావత్ ప్రపంచం ప్లాస్టిక్ మహమ్మారి సోకి తల్లడిల్లుతున్న వేళ బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ మనందరి జీవనాదమై వినిపిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు జల పర్యావరణ వ్యవస్థలోకి లీక్ అవుతున్నాయని ఓ అంచనా. ఆధునికత పేరుతో ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచే దిశలో వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్లాస్టిక్ వాడటం వల్ల మురుగునీరు పల్లపు ప్రాంతాల నుండి మైక్రో ప్లాస్టిక్‌లు నేలలో పేరుకుపోతున్నాయి. ఈసారి ఈ పర్యావరణ దినోత్సవ వేడుకలు "ట్రిపుల్ ప్లానెట్రీ క్రైసిస్" పై ప్రత్యేక దృష్టి సారించాయి. (1) వాతావరణ మార్పు సంక్షోభం. (2) ప్రకృతి సంక్షోభం, భూమి జీవ వైవిధ్య నష్టం. (3) కాలుష్యం, వ్యర్థాల సంక్షోభం. ఈసారి ఈ వేడుకల వల్ల పర్యావరణ సంరక్షణకై ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ప్రభుత్వాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవన విధానాల్లో మార్పులు తెచ్చే విధంగా ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ విషయంలో "5R" సూత్రం విలువను అన్వయించనున్నారు. అంటే– రెఫ్యూజ్, రెడ్యూస్, రీ–యూజ్, రీసైకిల్, రీథింక్ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు.

1972 సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి జూన్ 5న మొట్టమొదటి పర్యావరణ సమావేశం స్వీడన్ దేశంలోని స్టాక్ హోమ్ నగరంలో నిర్వహించింది. ఈ సమావేశంలో భవిష్యత్తులో పర్యావరణం సవాళ్లను, సమస్యలను ఎదుర్కోవడానికి మనం చేయవలసిన కార్యాచరణ ప్రణాళికల గురించి పెద్ద ఎత్తున చర్చ జరిగింది. దాన్నే స్టాక్ హోమ్ డిక్లరేషన్ అంటారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆనాటి మన దేశ ప్రధాని "నేటి పర్యావరణ సమస్యలకు అభివృద్ధి చెందిన అగ్రదేశాల బాధ్యతా రాహిత్యపు కార్యక్రమాలే కారణమని, ప్రపంచ వ్యాప్తంగా పేదరికం పారదోలాలంటే పర్యావరణ వినాశకుల చర్యలకు అడ్డుకట్ట వేయాలనీ, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి నిత్య అవసరాల కొనుగోలు శక్తిని పెంచాలనీ, సైన్స్ అండ్ టెక్నాలజీని వినియోగించుకుంటూనే, పేదరికాన్ని పారదోలాలని ఆమె చేసిన ప్రసంగం..

ఆమె దార్శనికతను తెలియజేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా సకల సౌకర్యాలతో తమ తమ ప్రాంతాల్లో ఆనందంగా జీవిస్తున్న వారంతా కాలుష్యం, భూతాపం వంటి పర్యావరణ సమస్యల వల్ల వేరే ప్రాంతాలకు వలస వెళ్లి బతుకు పోరాటంలో దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని పక్షిజాతులు అంతరించిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వేలాది ఎకరాల్లో పచ్చిక బయలు ధ్వంసం అవుతోంది. లక్ష ఎకరాల్లో భూమి బీడు బారిపోతోంది. ఓ సర్వే ప్రకారం మన దేశ జనాభాలో దాదాపు పంధొమ్మిది శాతం ప్రజలు భూ–క్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఓ నివేదిక ప్రకారం భూమి మీద ఉష్ణోగ్రతలు, యేటా సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 0.8 డిగ్రీల సెంటీగ్రేడ్ చొప్పున పెరుగుతూ ఉన్నాయి. వాతావరణంలో 1.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగితే సముద్రతీర ప్రాంతాల్లో ఉండే వేలాది దీవులు నీట మునిగిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించే యజ్ఞంలో భాగంగా కాల పరిణామ క్రమంలో ఎన్నో ముఖ్యమైన సదస్సులు జరిగాయి. ఎన్నో నూతన చట్టాలు అమలు చేయాలని తీర్మానించాయి. 1974లో సముద్ర జలాల కాలుష్య నివారణపై సదస్సు, 1979లో సుదూర ప్రాంతాలకు వాయు కాలుష్యంపై సదస్సు, 1985లో ఓజోన్ పొర పరిరక్షణ సదస్సు, 1989లో హానికర వ్యర్థాల నిర్మూలనపై సదస్సు ఇలాంటివి ఎన్నో. 2014లో మన దేశ ప్రభుత్వం 'గ్రీన్ ఇండియా నేషనల్ మిషన్' ప్రారంభించింది. అడవులు, మొక్కల పెంపకం, అడవుల విస్తీర్ణం పెంచడం, జీవ వైవిధ్యం పెంచడంతో పాటు పర్యావరణ వ్యవస్థ సేవలను మెరుగుపరచడం వంటి ఎన్నో ప్రతిపాదనలు చేశారు.



2009 డెన్మార్క్‌లోని కోపెన్ హాగెన్ సదస్సులో ప్రపంచ ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీల సెల్సియస్ స్థాయి కంటే పెరగకుండా చేసేందుకు వీలుగా కర్బన ఉద్గారాల విడుదలను తగ్గించేందుకు ప్రపంచ దేశాలు అంగీకరించటంతో పాటు, 2020 నుంచి ధనిక దేశాలు హరిత వాతావరణ నిధికి యేటా 100 బిలియన్ డాలర్ల చొప్పున అందజేయాలని ఈ సదస్సులో ప్రతిపాదించారు. కానీ ఈ ప్రతిపాదనలేవీ ఆచరణలో అమలు కాలేదు. అందుకే ఈ సదస్సును బ్రోకెన్ హాగెన్ సదస్సుగా అభివర్ణిస్తుంటారు. కాప్ 26వ సదస్సులో ఒకే సూర్యుడు ఒకే ప్రపంచం ఒకే గ్రేడ్ కార్యక్రమాన్ని మన దేశ ప్రధాని మోడీ ప్రతిపాదించారు. పర్యావరణాన్ని, భూగోళాన్ని కాపాడుకునేందుకు బొగ్గు వాడకాన్ని దశల వారీగా నిలిపివేయాలని ఈ సదస్సు ప్రధానంగా సూచించింది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంలో వస్తున్న అనూహ్య పరిణామాలను ఎదుర్కోవ డానికి మన దేశ ప్రభుత్వం 'పంచామృతాల' పేరిట స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకున్నది.

(1) 2070 సంవత్సరానికి భారత్ సున్నా కర్బన ఉద్గారాలను సాధిస్తుంది. (2) 2030 సంవత్సరానికి శిలాజేతర ఇంధనాల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని 500 గిగా వాట్ల సామర్థ్యాన్ని పెంచుతుంది. (3) 2030 నాటికి దేశంలోని కర్బన ఉద్గారాల తీవ్రతను 45 శాతం తగ్గిస్తుంది. (4) 2030 సంవత్సరానికి దేశంలో మొత్తం విద్యుత్ వాడకంలో 50 శాతం పునర్వినియోగ ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ నుంచే ఉపయోగిస్తుంది. (5) 2030 నాటికి దేశంలో విడుదలవుతాయని అంచనా వేసిన కర్బన ఉద్గారాల నుంచి ఒక బిలియన్ టన్నుల ఉద్గారాలు తగ్గిస్తుంది.

ఏదేమైనా ప్రపంచ కాలుష్య నగరాల జాబితాలో మన దేశ రాజధాని న్యూఢిల్లీ మొదటి వరుసలో ఉండటం ఆందోళన కలిగించే అంశమే. మనమంతా ఆకుపచ్చని భారతాన్ని చూడాలంటే మన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిందే. ప్రకృతిలో సౌరశక్తి అనంతరం కాలుష్య రహితం. అందువల్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రజలకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించి పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషించేలా నూతన పథకాలను ప్రవేశపెట్టాలి. అడవులను పరిరక్షిస్తూనే, జీవ వైవిధ్యతను పెంపొందించేలా ప్రణాళికలు రచించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పర్యావరణ విద్యను బట్టీ పట్టి రాసే మార్కుల పద్ధతిలో కాకుండా, ఆచరణాత్మకంగా అమలయ్యే విధంగా మన విద్యా వ్యవస్థలో మార్పు రావాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, ప్రభుత్వ అధికారులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, పర్యావరణవేత్తలు మొక్కలు నాటడంలో, నాటించడంలో, పెంచి పోషించడంలో ప్రముఖ పాత్ర వహించాలి.

ఇప్పటికైతే సౌర కుటుంబంలోనే మనిషి జీవించడానికి అనువైన గ్రహం మన భూమి మాత్రమే. పుడమిని తల్లిగా పూజించే దేశం మనది. అవనిని మన అమ్మలా పోల్చుతూ రాసే సాహిత్యం మనది. మన భవిష్యత్తు తరాల ప్రాణం వుండాలంటే పర్యావరణానికి పచ్చదనంతో మన ప్రాణం పోయాలి. పంచభూతాల స్వచ్ఛతకు మనమంతా నైతిక బాధ్యత వహించాలి. అంతరిక్ష హద్దుల్ని చెరిపేస్తూ, జాబిల్లిపై అంత్యాక్షరి పోటీలు పెట్టుకునే రోజులు, అంగారక గ్రహంపై ఆటలాడే సందర్భాలు రానున్న తరుణంలో మనమంతా వేసవి కాలంలో వణుకుతున్నాం. చలికాలంలో వేడికి తట్టుకోలేకపోతున్నాం. స్వచ్ఛమైన ఆక్సిజన్ అందక ప్రాణాలే కోల్పోతున్నాం. దీని గురించి అందరూ ఆలోచించాలి.

ప్రపంచమంతా సమిష్టిగా ఏకమై కాలుష్యంపై, ప్లాస్టిక్ వాడకంపై శాంతి యుద్ధం ప్రకటించేద్దాం. మన వంతుగా మొక్కల్ని నాటుదాం.

**- ఫిజిక్స్ అరుణ్‌కుమార్**

# నైతిక విలువలు పెంచే ఈసప్ నీతి కథలు



ప్రపంచ వ్యాప్తంగా నీతి కథల్లో ప్రసిద్ధి చెందాయి ఈసప్ నీతి కథలు. పిల్లలు ఈ కథల్ని ఎంతగానో ఇష్టపడతారు. ఈ నీతి కథలు పురాతన గ్రీసు దేశంలో ఉద్భవించిన నీతి బోధక కథల సమాహారం. ఈ కథలు ఈసప్ అనే గ్రీకు బానిస (క్రీ.పూ.6వ శతాబ్దం) పేరుతో ముడిపడి ఉన్నాయి. బానిస తన జ్ఞానం తెలివితేటలతో ప్రసిద్ధి చెందాడు. ఈసస్ చారిత్రక ఉనికి గురించి స్పష్టమైన ఆధారాలు లేవు. కొన్ని కథలు అతనికి ముందు లేదా ఇతర సంస్కృతుల నుండి వచ్చి ఉండవచ్చు అనే నానుడి కూడా ఉంది. ఈ కథలు పురాతన గ్రీకు సమాజంలోని నైతిక, సామాజిక విలువలను ప్రతిబింబిస్తాయి. అవి సరళమైన భాషలో, జంతువులు, మానవులు లేదా ప్రకృతి అంశాలను పాత్రలుగా ఉపయోగించి నీతిని బోధిస్తాయి. ఈ కథలు పిల్లలు, పెద్దలు అందరికీ అర్థమయ్యేలా రూపొందించబడ్డాయి. ఈసప్ కథలు నైతిక పాఠాలను అందించడం, సత్యం, నీతి, జ్ఞానం, సామాజిక భాధ్యతల వంటి విలువలను బలంగా చెప్పడం వంటి లక్ష్యంతో ఇమిడి ఉన్నాయి. కథలు చిన్నవి, సంక్షిప్తమైనవి. చివరలో నీతిని కలిగి ఉంటాయి. జంతువులకు మానవ లక్షణాలు (ఆంత్రోపోమార్ఫిజం) అపాదించడం ద్వారా సామాజిక విమర్శ, వ్యక్తిగత ప్రవర్తనలను సూచనాత్మకంగా చిత్రీకరిస్తాయి. ఈసప్ కథలు గ్రీసు సాహిత్యంతో పాటు రోమన్, యూరోపియన్, ప్రపంచ సాహిత్యంపై గణనీయమైన ప్రభావం చూపాయి. అవి భారతదేశంలోని పంచతంత్ర కథలు, జాతక కథలతో కొన్ని సారూప్యతలను కలిగి ఉన్నాయి. ఈ కథలు మౌఖిక సంప్రదాయంగా ప్రారంభమై తరువాత క్రీ.పూ. శన శతాబ్దంలో డెమెట్రియన్ ఫలేరియన్ వంటి వారిచే సేకరించబడ్డాయి. రోమన్ కవి ఫెడ్రస్ (1వ శతాబ్దం) బాబ్రియస్ వంటి వారు వీటిని లిఖిత రూపంలోకి మార్చాను. నక్క-ద్రాక్షపండ్లు; కోరినది సాధించలేనప్పుడు దానిని తక్కువ చేసిమాట్లాడకూడదని నీతి. పిల్లి-గంట; సమస్యను గుర్తించడం సులభం, పరిష్కరించడం కష్టమని నీతి.

## నేపథ్యం

ప్రపంచ ప్రసిద్ధి చెందిన నీతి కథల్లో ఈసప్ కథలు ప్రముఖమైనవి. అనేకమంది రచయితలు పలు భాషల్లో తమదైన శైలిలో ఈసప్ కథలను రచించి ప్రపంచ వ్యాప్తంగా పిల్లలకు అందించారు. జంతువులు ప్రధాన పాత్రలుగా ఈ కథలు అద్భుతంగా ఉంటాయి. మన పంచతంత్ర కథలకు వీటికి చాలా దగ్గరి పోలిక ఉంటుంది. పంచతంత్ర కథలు జంతువులను పాత్రలుగా చేసి మనుషుల స్వభావాలను వివరించే కథలు పిల్లల మనసు తెలుసుకుని వారిని మంచి నడవడికలో పెట్టేందుకు ఈ నీతి కథలు ఉపయోగపడతాయి. ఈనవ్ నీతి కథలు ప్రపంచ తంత్రాన్ని వివరించే కథలు, జంతువులను, పక్షులతోపాటు మనుషులు, దేవతల పాత్రలను సైతం ఉదహరిస్తూ సూక్తులు, మంచిమాటలు చెప్పడం ఈసప్ కథల్లో ప్రత్యేకత.

ఈసప్ కథలు జనబాహుళ్యంలోకి రావడానికి అనేకమంది అనేక రకాల కారణాలు చెబుతుంటారు. 2500 సంవత్సరాల చరిత్ర ఈ కథలున్నట్లు గ్రీకు చరిత్రకారులు పేర్కొన్నారు. ఈ కథలన్నీ పిల్లల్లో నైతిక విలువలు పెంచే అద్భుత రసగుళికలు. వీటిని ప్రపంచ వ్యాప్తంగా బాల్యం నుండే పిల్లలకు నేర్పిస్తే ఉత్తమ పౌరులు తయారవుతారనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే పంచతంత్ర కథలు, ఈసప్ కథలు ప్రారంభంలో గ్రంథస్థం కాలేదు. ఇవన్నీ ఆ నోటా, ఈ నోటా ప్రజలు చెప్పుకుంటూ ఒక తరం నుండి మరో తరానికి అందించారు. వందలాది సంవత్సరాల తరువాత గ్రంథస్థమైనాయి.

ఈసప్ కథల సంకలనాన్ని ఏసోపికా అంటారు. చరిత్ర పరిశోధకులకు లభించిన చిన్న చిన్న ఆధారాల వల్ల ఈసప్ ఈ కథలను తొలుత హిబ్రూ భాషలో చెప్పినట్లు తెలుస్తుంది. క్రీ.పూ.356-323 కు చెందిన ప్రపంచ విజేత అలెగ్జాండర్ చక్రవర్తి తన కాలంలో అనేకమంది కవి, పండితులు, బహు భాషా కోవిదులతో హిబ్రూ సాహిత్యాన్ని గ్రీకు భాషలోకి అనువదించి చేసినట్లు ఆధారాలు ఉన్నాయి.

గ్రీకు భాషలో అనువదించిన ఈ కథలన్నీ క్రీ.324 తరువాత ప్రజలకు పరిచయమయ్యాయి. ఆ తరువాత క్రీ.శ. 331లో ఇజ్రాయిలకు చెందిన ఈసూబియన్ అనే బహుభాషా కోవిదుడు ఈ కథలను సరళమైన గ్రీకు భాషలోకి మార్చి ప్రజలకు అందించాడు.

అనంతరం లాటిన్, ఫ్రెంచ్.. ఇలా ప్రపంచంలోని అన్ని భాషల్లోకి ఈసప్ కథలు అనువాదమయ్యాయి. ఈసప్ కథలు ప్రపంచంలోని పలు భాషల్లో వేలసార్లు పునః ముద్రణలు జరిగాయి. అనేకమంది చిత్రకారులు తమ కుంచెకు పదును పెట్టి ఈ కథలకు బొమ్మలను చిత్రించారు. గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ కథనం ప్రకారం ఈసప్ అనే వ్యక్తి థ్రేస్ అనే ప్రాంతంలో క్రీ.పూ. 620లో జన్మించాడు. ఆ ప్రాంతం నల్ల సముద్ర తీరాన ఉండగా, ఆ పట్టణాన్ని మెసెంబ్రియా అని వ్యవహరించేవారు. ఈసప్ కథలను ఫేడ్రస్ అనే వ్యక్తి లాటిన్ భాషలోకి అనువదించాడు.

ఈసప్ జన్మస్థలం ఫిజియా అని అంటారు. సామియన్ అనే సంపన్నుడి సహకారంతో తన బానిస బతుకు నుండి విముక్తి పొందాడు. అనాకారిగా ఉన్న ఈసప్‌కు ఒక గ్రీకు దేవత వరం ఇప్పడం వల్ల అతనికి ఇన్ని తెలివితేటలు లభించాయనే కథనాలు కూడా ప్రచారంలో ఉన్నాయి.


కొంతమంది విమర్శకుల అభిప్రాయం ప్రకారం ఈసప్ అనే వ్యక్తి ఉన్నాడా? లేడా? ఇది కల్పిత పాత్రా? అనే సందేహాలను వ్యక్తపరిచినవారు కూడా లేకపోలేదు. తమకు లభించిన ఆధారాలతో కొంతమంది శిల్పులు ఈసప్ శిల్పాన్ని శిల్పీకరించారు. అనేకమంది చిత్రకారులు దేశీ పరమైన ఆచార వ్యవహారాలను బట్టి ఈసప్ ఊహా చిత్రాన్ని చిత్రీకరించారు. ఈసప్ శిల్పంలోని రూపాన్ని బట్టి చూస్తే ఇతడు ఆఫ్రికా జాతీయుడివలే కనిపిస్తాడు.



జంతువులు మాట్లాడుకుంటూ ఉండే ఈసప్ కథలు నీతిని బోధిస్తాయి. అక్కడక్కడా మనుషుల పాత్రలతో కూడా కథలు ఉన్నాయి. ఈ కథలను విన్న రాజు ఈసప్ బానిసత్వం నుండి విముక్తి కలిగించి తన ఆస్థానంలో ఉన్నత పదవినిచ్చినట్లు చరిత్ర చెబుతోంది. చివరకు రాజుకు రాయబారిగా వ్యవహరించే గౌరవం కూడా ఈసప్ దక్కించుకున్నాడు. ఈసప్ ఎన్ని కథలు చెప్పాడు? ఎన్ని గ్రంథస్థమైనాయి? అనే విషయమై సరియైన పారదర్శకత లేదు. ఈ కథలు అపరిమితంగానే ఉండవచ్చని పరిశీలకుల అంచనా. ఎక్కువ కథలు వచనంలోనే ఉన్నాయి. ఈ కథలను పిల్లలేగాదు పెద్దలు సైతం ఉత్సాహంగా చదువుతారు.

ఈసప్ కథలు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ఇందులోని నీతి పిల్లల్లో ఉల్లాసాన్ని పెంపొందించి ఉత్సాహాన్ని నింపి, కొత్త ఆలోచనలు ఆవిష్కరింపజేస్తుంది. ఇవి చదవడం ద్వారా పిల్లల్లో నైతిక విలువలు పెరుగుతాయి. జీవిత సత్యాలు ఈ కథల్లో ఉండటం వల్ల వీటిని పిల్లలకే పరిమితం చేయడం సబబు కాదు. పెద్దలు కూడా వీటిని చదవడం ద్వారా వారిలో సైతం నైతిక విలువలు పెరుగుతాయి. వయోభేదం లేకుండా అందరినీ అలరించేవి ఈసప్ కథలు అనుభవాలు నేర్పిన పాఠాల నుండి ఈ కథలు పుట్టాయా? అన్నట్లు ఉంటాయి. ఈసప్ కథలు అత్యాశను ఎండగడతాయి అత్యాశ వల్ల మనుషుల్లో జన్మించే క్రౌర్యాన్ని ఈ కథలు నిరసిస్తాయి. జంతువులు ప్రధాన పాత్రలుగా ఈ కథలు సాగినప్పటికీ సమాజంలోని అరాచకత్వాన్ని కడిగేస్తాయి. నోరులేని జీవాలే కథావస్తువులుగా మారి నీతులు వల్లిస్తాయి.

ఈసప్ కథల అనువాద గ్రంథాలు ప్రారంభమైనాయి. ఫేడ్రస్ అనే వ్యక్తి లాటిన్ భాషలోకి వీటిని అనువదించాడు. అనేకమంది ఈసప్ గురించి గ్రంథాలలో పేర్కొన్నారు. ఆధునిక కాలంలో ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ, గ్రీకు దేశాలలో గ్రంథస్థం చేశారు. ఈ విధంగా ఈసప్ కథలు చాలా ప్రాచుర్యాన్ని పొందాయి. అమోల్ షాంబ్రి అనే వ్యక్తి క్రీ.శ.1927లో 358 ఈసప్ కథలతో గ్రంథాన్ని రూపొందించాడు. గ్రీకు గ్రంథాలయంలో 426 కథలతో ఒక గ్రంథం అందుబాటులో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది రచయితలు ఈసప్ కథలను సేకరించి వారివారి భాషల్లోకి అనువదించి అందరికీ అందుబాటులోకి తెచ్చారు. ఎవరు ఏ భాషలో ఈసప్ కథలను అందించినా, అనువదించినా అన్ని గ్రీకు దేశం మూలాల నుండి వచ్చినవే అనేది స్పష్టం.



ప్లూటార్క్ అనే రచయిత ది బాంక్వెట్ అఫ్ సీజెస్ అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో ఈసప్ భావాలను రచయిత వెల్లడించి చెప్పాడు. ఆంగ్లంతో పాటు ఫ్రెంచి, లాటిన్ భాషలలో కూడా ఈ కథలను అనువదించాడు. 19వ శతాబ్దం తరువాత ఈసప్ కథలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. 20వ శతాబ్దంలో ఈసప్ కథావస్తువుగా మూడు నవలలు కూడా ప్రచురితమైనాయి. బ్రిటిష్ నాటక రచయిత పీటర్ టెర్సన్ ఈసప్ కథల గురించి కూర్చిన సంగీత విభావరులు, చిత్రాలు ప్రజాదరణ పొందాయి.

ఏసోపికా అనేది ఈసప్ నీతి కథలతో కూర్చిన ఓ బృహత్తర గ్రంథం. తొలుత ఈ కథలు మౌలికంగానే వచ్చాయి. తరువాత ప్రజా బాహుళ్యంలోకి వచ్చి ఆ నోటా ఈ నోటా ప్రచారం పొందాయి. అచ్చుయంత్రం కనుగొన్న తరువాత ఈసప్ కథలను ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువదించారు.

## ఇతర భాషల్లోకి ఈసప్ కథలు

చాలా దశాబ్దాల తరువాత ఈసప్ కథలను గ్రంథస్థం చేయడంతో పాటు ఇతర భాషల్లోకి అనువదించారు. హిబ్రూ భాషలోని ఈసప్ కథలను గ్రీసు భాషలోకి అనువదించారు. తరువాత వీటిని లాటిన్ భాషలోకి అనువదించారు. కొన్ని శతాబ్దాల పాటు ఈ కథలు లాటిన్ భాషలోనే ప్రజాదరణ పొందాయి. 20వ శతాబ్దంలో ఈ కథలు ఆంగ్ల భాషలోని పలు మాండలికాల్లో దూసుకునివెళ్లి ప్రజాదరణ పొందాయి. అనేకమంది ఈ కథలను కార్టూన్ యానిమేషన్ రూపంలో చిత్రించి దృశ్య మాధ్యమాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చారు. 1960లో జేవార్ట్ అనే యానిమేటర్ టెలివిజన్ కోసం ధారావాహికలు నిర్మించాడు. వాటిలో ఒకటి ఈసప్ అండ్ సన్. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1971లో ఈసప్ ఫ్యాబుల్స్ పేరిట టి.వి. చిత్రాన్ని నిర్మించారు. 1989-91 మధ్య ప్రాంతంలో ఈసప్ ఆధారిత కల్పిత కథలు ఫ్రెంచి టెలివిజన్‌లో ప్రసారమయ్యాయి. 1983లో జపాన్‌తో పాటు చైనా టెలివిజన్‌లలో సైతం ఈసప్ కథలు ప్రసారమయ్యాయి. ఇవన్నీ పిల్లలను అలరించేలా నిర్మించారు. ఈ కథలను కొందరు నిర్మాతలు యువతను ఉద్దేశించి కూడా నిర్మించారు. బాల సాహిత్యం ఉన్నంత కాలం ఈసప్ కథలు ఉంటాయి. ఈసప్ కథలకు ప్రపంచ వ్యాప్తంగా సుస్థిర స్థానం ఏర్పడింది. ఇతను చిరస్థాయిగా నిలిచి ఉంటాడు.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

## మేషం

ఈ వారం పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు. వృత్తివ్యాపారాలను విస్తరిస్తారు. రాజకీయ, కళారంగాలలోని వారికి యోగదాయమైన కాలం. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నిత్యం ఓం నమో నారాయణ వత్తులు అష్టమూలికాతైలంతో కలిపి దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది.

## వృషభం

ఈ వారం కాంట్రాక్టు శ్రమానంతరం దక్కుతాయి. వృత్తివ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు. జీవితభాగస్వామి నుండి సహాయసహకారాలు పొందుతారు. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది. ప్రతి నిత్యం ఇంట్లోకాని, వ్యాపార ప్రవేశాలలో కానీ అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయండి.

## మిథునం

ఈ వారం భూమివివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. సంతానం సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు. నిత్యం మహాతీర్థం పొడితో చేసే అభిషేకాలు, పూజలు మంచిఫలితాలు ఇస్తాయి. ఇష్టదేవతానుగ్రహం కలుగుతుంది. కాంట్రాక్టులు, లీజులు, సబ్‌కాంట్రాక్టులు లాభిస్తాయి. ఉద్యోగాలలో పదోన్నతలు పొందుతారు.

## కర్కాటకం

ఈ వారం రాబడి రెండు, మూడు విధాలుగా వుంటుంది. దీర్ఘకాలిక రుణాలు అని ఊరట పొందుతారు. మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిత్యం ఓం నమోశివాయ వత్తులతో అష్టమూలికా తైలం కలిపి దీపారాధన చేయటం అన్నివిధాలా మంచిది. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

## సింహం

ఈ వారం ప్రయాణాలలో తొందరపాటు నిర్ణయాలు వద్దు. నిత్యం సర్వదోష నివారణ చూర్ణముతో సర్వరక్షా చూర్ణము కలిపి స్నానం చేయటంవలన గ్రహాలవలన కలుగు బాధలు తొలతుతాయి. వృత్తివ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. రాజకీయ, పారిశ్రామిరంగాలలోని వారికి కొంత అనుకూలంగా వుంటుంది.

## కన్య

ఈ వారం ఈ వారం అన్ని విధాలుగా మీదే పై చేయిగా ఉంటుంది. నిత్యం కుబేరకంకణం ధరించడం అన్ని విధాలా మంచిది. వివాహ, ఉద్యోగ, యత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలను విస్తరిస్తారు. ఇతరుల విషయాలలో జోక్యం తగదు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఇంటా బయట అనుకూలం.

## తుల

ఈ వారం కొత్తకార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండటం అన్నివిధాలా మంచిది. ఐశ్వర్య నాగినిని ఉపయోగించడం వలన లక్ష్మీ కటాక్షం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలలో ఆటుపోట్లు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. పనులు నిదానంగా సాగుతాయి.

## వృశ్చికం

ఈ వారం తన శాంతమే తనకు రక్ష అన్న నానుడికిని మరువకండి. నిత్యం దీపారాధన కుందిలో రెండు చుక్కలు పరిమళ గంధం వేయటం అన్ని విధాలా మంచిది. చెల్లించవలసిన ఋణాలకై వత్తిడి అధికమవుతుంది. ఉపయుక్తం లేని వివాదాలు కాలహరణానికి కారణం అవుతాయి. విద్యారంగంలో మంచి ప్రోత్సాహం లభిస్తుంది. నిష్కారణమైన

## ధనస్సు

ఈ వారం క్షణం కూడా వృథా చేయకుండా కాలాన్ని అనుకూలంగా మలుచుకోగలుగుతారు. మీ అభిరుచికి తగిన విధంగా గృహాన్ని నిర్మించుకోవడంలో దాదాపుగా సఫలీకృత లవుతారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. నిత్య యజ్ఞభస్మాన్ని ధరించటం వలన యజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. కాంట్రాక్టులు దక్కుతాయి.

## మకరం

ఈ వారం శుభకార్య చర్యలు అనుకూలిస్తాయి. వృత్తిపరంగా కనబరచే ఓర్పు మంచి ఫలితాన్నిస్తుంది. జీవిత భాగస్వామితో అభిప్రాయ భేదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి. నిత్యం సిద్ధగంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని అర్చించడం చెప్పదగిన సూచన. భాగస్వామ్య వ్యాపారాలు విస్తరిస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చాలా అవసరం. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

## కుంభం


ఈ వారం ఆర్థికలావాదేవీలు సంతృప్తికరంగా వుంటాయి. జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. అరటినార వత్తులు అష్టమూలికా తైలంతో దీపారాధన చేయటం వలన సంతాన పురోగతి వుంటుంది. ఉద్యోగాలలో ఇంక్రిమెంట్లు, పదోన్నతలు పొందుతారు. అన్ని విషయాలలో అదృష్టానికి, శుభానికి దగ్గరగా జీవితం గడుస్తుంది.


## మీనం


ఈ వారం ఆర్థికపరిస్థితి అనుకూలంగావున్నా చెల్లింపులను సకాలంలో చెల్లించలేరు. వృత్తి, ఉద్యోగాల పరంగా చెప్పుకోదగిన మార్పులేవీ ఉండవు. నిత్యం శక్తి కంకణం ధరించండి. ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలకు గాను మీరు చేసే విదేశీయాన ప్రయత్నాలు కలిసివస్తాయి. కోటి విద్యలు కూటి కోసమేనని అభివృద్ధి కోసం అనేక విధాలా ప్రయత్నం చేస్తారు. వస్తువుల సేకరణ.

## ఈ వారం 'కార్ట్యూన్స్'


ఖజానా ఖాళీ....! ఆర్మీ లో జాయిన్ అయితే జీతాలు ఎప్పుడు ఇస్తారో తెలియదు ... టెర్రరిస్ట్ గా చేరితే డబుల్ జీతం, రెగ్యులర్ పేమెంట్ ...!!
.రిక్రూట్‌మెంట్.


'ఛీ పాడు పిల్లి' అంటారా..
మౌస్ ఎత్తుకొచ్చేసా..!!


ఈ ఇంటిని ఆటో ముష్టి సోదరుడెవడో కూ
'ముష్టి యాప్' లో బ్లాక్ చేసాడు.. సారీ !!



నీళ్ల మీద నడిచే మహాపురుషులు.. అని చిన్నతనంలో చదువుకున్న విషయాలు జ్ఞాపకం వస్తున్నాయి కదూ ఈ చిత్రాలు చూస్తుంటే! మీకూ నీళ్ల మీద నడవాలన్న తృష్ణ వుంటే ఇటలీకి ప్రయాణమవ్వండి. ఇటలీలోని ఇసియో అనే సరస్సు పైన వాక్ ఆన్ వాటర్ పేరుతో నీళ్ల మీద సుమారు మూడు కి.మీ. దారిని క్యూబుల పైన బట్టను పరిచి తేలే దారి ఏర్పాటు చేసారు. ఈ దారి మీద నడవడానికి సందర్శకులు ఉవ్విళ్లూరుతున్నారని ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదుగా!









